RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 58 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి శుక్రవారం 10-04-2026 పేజీలు :8 వెల : రూ.1-00

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం



- 21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం
- జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి
- విభజన కన్నా జగన్ వల్లనే ఏపీ నష్టపోయింది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత



**బాపట్ల, ఏప్రిల్09 (నేటి మనదేశమ్) :** ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతు

తరువాయి 2లో..

# ఈసారి బెంగాల్ అంతటా 'నందిగ్రామ్' ఫలితమే

## నరేంద్ర మోదీ



**పశ్చిమ బెంగాల్, ఏప్రిల్ 09 :** పశ్చిమబెంగాల్‌లోని హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 5ఏళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓటమిని గుర్తు చేస్తూ.. ఈసారి బెంగాల్ అంతటా అదే ఫలితం వస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

"బెంగాల్ మార్పును కోరు కుంటోంది. ఈ క్రమంలో భాజపా భారీ విజయాన్ని మనం తప్పకుండా చూస్తాం. నందిగ్రామ్‌లో 5ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు.. భవానీపుర్‌తో పాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుంది. ఇవి సాధారణ ఎన్నికలు కావు. అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగ రాయడానికి ఎంతగానో తోడ్పడతాయి. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోంది. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోంది. భాజపా అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం. బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు" అని మోదీ వెల్లడించారు.

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై వైసీపీ దాడిని ఖండించిన ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



**పశ్చిమ గోదావరి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై వైసీపీ శ్రేణుల దాడులను ఇప్పటికే పలువురు రాజకీయ ప్రముఖులు ఖండించారు. నిజాలను నిర్భయంగా చెబితే దాడులు చేయడాన్ని, పత్రికా స్వేచ్ఛను హరించడాన్ని సభ్యసమాజం ఊరుకోదని రాజకీయ నేతలు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహా కూటమి నేతలంతా ముక్తకంఠంతో దాడులను వ్యతిరేకించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సైతం ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై దాడిని ఖండించారు. తాజాగా వైసీపీ దాడులపై ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. నిరసనలు తెలిపే విధానాలు వేరే ఉంటాయని.. దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. దాడులు చేయడమనేది నిరసనల్లో భాగంగా వైసీపీ భావిస్తోందని ఆయన అన్నారు. ఇలాగే గతంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం దాడి చేయ డంతో వై నాట్ 175 కాస్త 11 అయ్యిందని ఆర్ఆర్ఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మావిగన్' వస్తుంది, తాను తెస్తానని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అదే పనిగా చెబుతున్నారని ఆగ్రహించారు. ఏపీ అసెంబ్లీలో మావిగన్ బిల్లు పెడతానని జగన్ అంటు న్నారని.. అది జరగదని డిప్యూటీ స్పీకర్ తేల్చిచెప్పారు. జగన్ రోజూ సినిమాలు చూపిస్తే చూసేందుకు ఎవరూ ఖాళీగా లేరని రఘురామ మండి పడ్డారు.ఈ సందర్భంగా తన కస్టోడియల్ టార్చర్ కేసుపైనా స్పందించారు. తనను కొట్టిన వారిని శిక్షించమని అడుగు

తరువాయి 2లో..

# అప్పుడు రుషికొండ మింగేశారు.. ఇప్పుడు మావిగన్ జోకర్‌గా మిగిలారు: షర్మిల




**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** వారసులమని చెప్పుకొనే జగన్ కేవలం వైయస్సార్ పేరును మాత్రమే వాడుకున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ వారసులు కాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. "వైఎస్ఆర్ వ్యతిరేకించిన భాజపాకి దత్త పుత్రుడిగా ఎందుకు మారారు? ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారు? మూడు రాజధానుల పేరుతో రుషి కొండ మింగేసి ప్యాలెస్‌లు కట్టారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలారు. 'మాట తప్పం మడమ తిప్పం' అనే వైయస్సార్ లైన్ వాడుకోవడం తప్పిస్తే.. పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి "ఓన్లీ క్యాష్" మాఫియా ఎందుకు చేశారు? వైయస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే మౌనంగా ఎందుకున్నారు ? "అని షర్మిల ప్రశ్నించారు.

# ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవాస్ఫూర్తికి జోహార్లు: లోకేశ్



**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** పేద ప్రజలకు దేవుడిచ్చిన వ్యక్తి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఫాదర్ విన్సెంట్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవాస్ఫూర్తికి జోహార్లు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "అర్ధ శతాబ్దం క్రితం తెలుగునేలపై అడుగుపెట్టి రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్‌ను ఆరంభించి, అనంత ప్రజల ఆశాజ్యోతిగా వెలుగొందారు ఫాదర్ విన్సెంట్. తెలుగు రాష్ట్రాల్లో ఆసుపత్రులు, విద్యాలయాలు, స్వయం సహాయక సంఘాలు, క్రీడామైదానాలు, నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణంతో ప్రగతి ప్రదాతగా నిలిచారు. ఈ ఏడాది ఫాదర్ ఫెర్రర్ జయంతి కానుకగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అనుమతిని సాధించి, ప్రజలకు నిరంతరాయంగా ఆర్డీటీ సేవలు అందేలా కృషి చేశాం. నిస్వార్థ సేవతో ప్రజల గుండెల్లో చిరకాలం జీవించి ఉండే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళులు అర్పిస్తున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు

# నేను ఆరోగ్యంగా ఉన్నాను.. ఆందోళన వద్దు - యనమల



**తుని, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, తన ఆరోగ్యంపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వచ్చిన యనమల..

తరువాయి 2లో..

# అచ్చెన్నాయుడి వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్సీ బొత్స



**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు దిగజారి మాట్లాడుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఖండించడానికి తాను మీడియా ముందుకు రాలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు అహంకార పూరితంగా ఉన్నాయని బొత్స అభివర్ణించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ గుర్తు చేసుకున్నారు. గురువారం రాజధాని అమరావతిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బొత్స సత్య నారాయణ విశాఖపట్నంలో స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డిని గుర్తు చేసుకుని బొత్స తీవ్ర భావోద్వేగానికి గుర య్యారు. అనంతరం బొత్స సత్య నారాయణ మాట్లాడుతూ.. టీడీపీపై గతంలో మీరు ఏమన్నారో మర్చిపోయారా? అంటూ కె. అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత.. తాను, తన భార్య పావురాల గుట్టకు వెళ్లామని పేర్కొన్నారు. కావాలంటే రాజధాని అమరావతిపై మాట్లాడండి.. అంతేకానీ ఏమిటి ఈ మాటలు? అంటూ అచ్చెన్నా యుడిని బొత్స నిలదీశారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు మాట్లాడతారు? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలు కోసం ఇంత దిగ జారుడా.. ఇదేమి రాజకీయం అంటూ సీఎం చంద్రబాబును బొత్స ప్రశ్నించారు.

# బాలికల మృతిపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి



**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం మూలగుమ్మి జలపాతంలో ముగ్గురు బాలికలు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెల్ఫీ దిగుతూ ప్రమాదవశాత్తూ జలపాతంలో పడి బాలికలు మృతిచెందడం అత్యంత విషాదకరమని తెలిపారు. ఇటీవలే ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి భవిష్యత్‌కోసం కలలు గంటున్నారని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు

తరువాయి 2లో..

# రాజకీయ నేతల ప్రవర్తన, పనితీరు యువతకు ఆదర్శంగా ఉండాలి

## అయ్యన్నపాత్రుడు



వార్త.. 2 లో

మొదటిపేజీ తరువాయి...

## ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

లకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని

వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేక పోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు.

ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని..

ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

## ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై వైసీపీ దాడిని ఖండించిన

### ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

తున్నట్లు ఆయన చెప్పారు. తమిళనాడులో తండ్రికుమారులను కస్టోడియల్ టార్చర్ చేసి చంపిన కేసులో పోలీసులకు ఏమైందో తెలుసు కదా? అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తన కేసులోనూ అలాగే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే సునీల్ కుమార్ అండ్ బ్యాచ్‌కు భయం పట్టుకుందని రఘు రామకృష్ణరాజు అన్నారు.

## నేను ఆరోగ్యంగా ఉన్నాను.. ఆందోళన వద్దు

వైద్యుల సూచన మేరకు గుండెకు స్టెంట్ వేయించుకున్నట్లు ప్రకటనలో తెలిపారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణలో సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, త్వరలోనే ప్రజలను నేరుగా కలుస్తానని తెలిపారు.

## జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో గందరగోళం సృష్టించారు : అనగాని



**బాపట్ల, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో గందరగోళం సృష్టించారని, రైతుల భూములను '21ఏ'లో చేర్చి ఇబ్బందులకు గురి చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. "ప్రపంచంలో తెలుగువారంతా గర్వించే నగరం ఏపీ రాజధాని అమరావతి. అందరి ఆశీస్సులతో అమరావతి నిలబడింది. దేశంలోని అన్ని పార్టీలు అమరావతి కావాలన్నాయి. ఒకే ఒక్క వైకాపా మాత్రం వ్యతిరేకిస్తోంది. రాజధాని రైతుల పాదయాత్ర ఈ ప్రాంతం గుండా వెళ్లింది. అప్పుడు రైతులకు మద్దతిచ్చాం. జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో గందరగోళం చేశారు. సరిహద్దు రాళ్లపై ఆయన బొమ్మలు వేశారు. రైతుల భూములను '21ఏ'లో చేర్చి ఇబ్బందులకు గురి చేశారు. జగన్ ఫొటోతో ఉన్న పాస్ పుస్తకాలు మనకు అవసరమా? రైతులు భూమిని ఆత్మ గౌరవంగా భావిస్తారు. అందుకే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశాం. రైతులకు ఇబ్బంది లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నాం. తుగ్లక్ పార్టీని మరోసారి రాకుండా జనం చూడాలి" అని పేర్కొన్నారు. రాజధానిగా అమరావతి గెజిట్ వచ్చాక సీఎం చంద్రబాబు మొదటి పర్యటనగా మన వద్దకు వచ్చారని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. "కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోంది. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారు. జగన్ ప్రజా జీవితంలో పనికి రాడని జనం 11 సీట్లు ఇచ్చారు.

## బాలికల మృతిపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

ధైర్యం కలగాలని తెలిపారు. అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## రాజకీయ నేతల ప్రవర్తన, పనితీరు యువతకు ఆదర్శంగా ఉండాలి : అయ్యన్నపాత్రుడు

**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్న రాజకీయాలను యువత ఏవగించు కుంటున్నారని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. గోవాలో పశ్చిమ ప్రాంత కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో స్పీకర్ పాల్గొని ప్రసంగించారు. చట్టసభల్లో రభస చేయడానికి మాత్రమే పరిమితమై..

సభకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకునే ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. వీళ్లు కళ్లెదురుగా కనిపిస్తుంటే యువతరానికి రాజకీయాలు అంటే గౌరవం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. ఈ ధోరణి మారాలంటే రాజకీయ నాయకుల నడవడిక మారాలని సూచించారు. చట్టసభల్లో వారి ప్రవర్తన, పనితీరు ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో రాజకీయాలకు దాదాపు తెరపడిందని స్పీకర్ తెలిపారు. రాజకీయ ప్రయోగశాలగా ఉండే విశ్వ విద్యాలయాల నుంచి విద్యార్థులు రాజకీయాల్లో ప్రవేశించడం దాదాపు శూన్యం అయిందన్నారు స్పీకర్. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి ఎందరో నవతరానికి, వారసత్వం లేని వారికి రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు తొమ్మిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. మహిళా రిజర్వేషన్ అమలులోకి వచ్చిన తరువాత చట్టసభల్లో 33 శాతం సీట్లు 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారికోసం రిజర్వ్ చేయాలని సూచించిన స్పీకర్.. అప్పుడే కొత్త నీరు వస్తుందని అభిప్రాయపడ్డారు. భిన్నంగా ఆలోచించకపోతే యువతను రాజకీయాలవైపు ఆకర్షించడం, వారికి అవకాశాలు కల్పించడం సాధ్యం కాదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్ల ఎమ్మెల్యే కోళ్ల

### - నియోజకవర్గ అభివృద్ధికి రూ.240 కోట్లు ఇవ్వండి - సానుకూలంగా స్పందించిన సీఎం



**కొత్తవలస, ఏప్రిల్ 09, నేటి మనదేశమ్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో విజయనగరం జిల్లా నాయకులతో కలిసి ఎస్. కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువచ్చారు నియోజక వర్గవ్యాప్తంగా ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించే జలజీవన్ మిషన్ పనుల కోసం రూ.220 కోట్లు కేటాయించాలని అలాగే, కొత్తవలస - విజయనగరం మార్గంలోని అలమండ వద్ద ఉన్న చిన్న వంతెన స్థానంలో రూ.10 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జిని, భీమసింగి - ఎస్.కోట రోడ్డులోని తానవరం - లక్ష్మీపురం మధ్య రూ.10 కోట్లతో మరో హైలెవెల్ బ్రిడ్జిని వంతెనను నిర్మించాలని కోరారు. పెందుర్తి నుంచి బౌడారా వరకు మంజూరు అయి ఉన్న నాలుగు వరుసల రహదారి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని విన్నవించారు. నియోజకవర్గంలో విద్య మరియు ఉపాధి అవకాశాల కల్పనపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించి కొత్తవలస మండలం రెల్లిలో ప్రతిపాదించిన గ్రేహౌండ్స్ బెటాలియన్ పనులను త్వరగా ప్రారంభించి,స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపాలని అలాగే కొత్తవలసలో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విన్నవించిన అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## మలుం గుమ్మి జలపాతంలో విషాదం

### - ముగ్గురు విద్యార్థులు జల సమాధి

### - ఘటనా స్థలంలో కొనసాగుతున్న పోలీస్, వైద్య శాఖల పంచనామా







**అనంతగిరి, ఏప్రిల్ 09, నేటి మనదేశమ్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని మలుం గుమ్మి జలపాతం వద్ద గురువారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. సరదాగా గడుపుదామని వచ్చిన నలుగురు విద్యార్థినుల్లో ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందగా, ఒకరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. హుకుంపేట మండలం బుర్జ పంచాయతీ జంబువలస గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మలుం గుమ్మి జలపాతాన్ని సందర్శించేం దుకు వెళ్లారు. నీటిలోకి దిగిన సమయంలో లోతు తెలియక పోవడంతో నలుగురు ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి ఒకరిని కాపాడగలిగినప్పటికీ, మిగిలిన ముగ్గురు అప్పటికే మృతి చెందారు. మృతులంతా ఎస్టీ కొండదొర కులానికి చెందిన వారు.?పోలీస్ మరియు వైద్య శాఖల ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీస్ మరియు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం మృత దేహాలకు అధికారులు పంచనామా నిర్వహిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతుండగా, వైద్య బృందం తమ విధుల్లో నిమగ్నమయ్యారు.

మృతుల వివరాలు : సలేపు త్రిష (17), తండ్రి: కొండ.సలేపు రత్నకుమారి (16), తండ్రి: దేముడు. సలేపు పవిత్ర (16), తండ్రి: చందారు. ఈ ప్రమాదం నుండి సలేపు అంజలి (18), తండ్రి: దేముడు, తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని వైద్యులు వెల్లడించారు.

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువతులు మృతి చెందడంతో జంబువలస గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల 9వ తేదీన అనంతగిరి పి హెచ్ సి లో గర్భిణీ స్త్రీలకు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార పంపిణీ కార్యక్రమం



**అనంతగిరి, ఏప్రిల్ 09, నేటి మనదేశమ్ :** మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల 9వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి పి హెచ్ సి లో గర్భిణీ స్త్రీలకు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ అన్నప్రసాధం చేయడం ఆకలిగా ఉన్న సమయంలో అన్నం పెట్టడంలో మహాదానం చేయడమే చారిటబుల్ ట్రస్ట్ మరేన్నో సేవాకార్యక్రమాలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అనంతగిరి సి డీ పీ ఓ శ్రీమతి ఎన్ సుగుణ అనంతగిరి పి. హెచ్. ఎన్. పి. వెంకటలక్ష్మి బంగారమ్మ చార్టిబుల్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ బి. వెంకటరమణ గమ అల్లూరి జిల్లా టీమ్ సభ్యులు ఆర్ ఎమ్ పి వైద్యులు నగేష్ , తమ్ముడు ఉదయ్, రమేష్, చిన్న, సతీష్ చంటి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు ఇటువంటి...మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు,

## సోషల్ మీడియా పోస్టింగ్‌లపై హైకోర్టు ఆగ్రహం

### పోలీసులు కఠినంగా ఉంటే ఇలా జరిగేది కాదని వ్యాఖ్య

**అమరావతి,ఏప్రిల్ 09 :** సామాజిక మాధ్యమాల పోస్టింగ్‌లపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2029లో మీరు చేసే విధ్వంసం కోసం ఎదురు చూస్తున్నట్లు ఫ్లెక్సీలు పెడతారా? అంటూ ఘాటుగా ప్రశ్నించింది. ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటే ఎంత ధైర్యం ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎవరిని విధ్వంసం చేస్తారు.. రాష్టాన్నా? రాష్ట్ర ప్రజలనా? అని ప్రశ్నించింది. సీఎంను అవమానించడమంటే 5 కోట్ల ఆంధ్రులను అవమానించడం కాదా? వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడుతారా? అవమానించేలా మాట్లాడే హక్కు, పోస్టులు పెట్టే అధికారం ఎవరిచ్చారు అన ఇప్రశ్నించింది. వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితి పునరావృతం అయ్యేదే కాదు. కోర్టులు, చట్టమంటే భయం కలిగేలా పోలీసుల చర్యలు ఉండాలి.

## ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారం

**ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు**
**ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**ఏలూరు,ఏప్రిల్ 09 :** ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారంలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రవణ్ కుమార్ వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాజుతోపాటు మరో ఆరుగురు దేవస్థానం ఉద్యోగులను అరెస్ట్ చేశామని చెప్పారు. గురువారం ఏలూరులో డీఎస్పీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. నిందితుల వద్ద నుంచి నకిలీ టికెట్ల ప్రింటింగ్‌కు ఉపయోగించిన ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది మార్చి రెండో వారంలో ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నకిలీ దర్శనం టికెట్ల విక్రయం బహిర్గతమైంది. ఆలయంలో స్కానింగ్ పాయింట్ వద్ద కొన్ని దర్శనం టికెట్లు స్కాన్ కాకపోవడంతో ఈ వ్యవహారం బట్టబయలు అయింది. ఈ వ్యవహారంలో దేవస్థానం ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దేవాలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తుంటారు. భక్తులు.. కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేసి దేవాలయంలో ప్రవేశించి.. స్కానింగ్ పాయింట్ వద్ద భద్రతా సిబ్బందికి వాటిని ఇస్తారు. వారు ఈ టికెట్లను స్కాన్ చేసి భక్తులను దేవాలయంలోకి అనుమతిస్తారు. ఆలయంలో ఏఈవో కుమారుడు రాజు దేవాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.200 టికెట్లను అతడు టికెట్ కౌంటర్‌లోవిక్రయించాడు. అవి ఆలయంలో స్కానింగ్ పాయింట్ల వద్ద స్కాన్ చేస్తే.. టికెట్లు స్కాన్ కావడం లేదు. దీంతో ఈ విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారుల దృష్టికి భద్రతా ... వారు వెంటనే రంగంలోకి దిగి.. కౌంటర్‌లో జారీ చేసిన టికెట్లను పరిశీలించారు. అవి 61 టికెట్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ టికెట్లు జారీ చేసిన రాజును దేవస్థానం అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఈ వ్యవహారంపై పోలీసులకు దేవస్థానం ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దీంతో ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

వేలం కేటలాగ్ నం.: CAT-Premium-04

(1) లాట్ నం./కేటగిరి: MSS-WAT-SCM-PS-114-26-1 (Misc-Static-Services-Premium Stores)

వివరణ: ఐస్ క్రీమ్‌లు & బెవరేజెస్ కొరకు ప్రీమియమ్ బ్రాండ్ కేటరింగ్ అవుట్‌లెట్ నెలకొల్పుట మరియు ఆపరేషన్ - ఏరియా 6.8*4.2 మీటర్లతో స్టాల్ నం. 4 & 5 (స్కెచ్ చూడండి)

(2) లాట్ నం./కేటగిరి: MSS-WAT-SCM-PS-116-26-1 (Misc-Static-Services-Premium Stores)

వివరణ: స్వీట్లు మరియు బేకరి కొరకు ప్రీమియమ్ బ్రాండ్ కేటరింగ్ అవుట్‌లెట్ నెలకొల్పుట మరియు ఆపరేషన్ - ఏరియా 10.8*3.2 మీటర్లతో స్టాల్ నం. 1,2 మరియు 3 (స్కెచ్ చూడండి)

లాట్ ప్రారంభ తేది & సమయం: 16.04.2026న 11.00 గం.లకు (రెండు క్ర.సం.లకు)

లాట్ ముగింపు తేది & సమయం: 16.04.2026న 11.30 గం.లకు (క్ర.సం.1కు) మరియు 11.40 గం.లకు (క్ర.సం. 2కు)

పూర్తి వివరాలు వెబ్‌సైట్ www.ireps.gov.inలో లభించును.

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ / వాల్తేరు

PR-32/R/26-27

# నేటి మనదేశమ్ సంపాదకీయం

## ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷- నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేక పోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతు లకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి

## జిల్లా గ్రంథాలయ సంస్థ సమస్యలు



**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్) :**ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గ్రంథా లయాల అభివృద్ధి, మౌలిక సదు పాయాల కల్పన మరియు పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదలపై జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ వన్నెంరెడ్డి సతీశ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాన్య శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ని కలిసి వినతిపత్రం సమర్పించి సమస్య లను పరిష్కరించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల ప్రస్తుత స్థితిగతులను ఉప ముఖ్య మంత్రికి క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ప్రధానంగా చర్చించిన అంశాలు క్రింది విధంగా ఉన్నాయి:

- 2008-09 నుండి ప్రభుత్వం నుంచి సుమారు రూ. 30.02 కోట్ల గ్రాంట్లు పెండింగ్‌లో ఉన్నాయి.- మున్సిపల్ కార్పొరేషన్ల నుండి రూ. 200 కోట్లకు పైగా, గ్రామ పంచాయతీల నుండి రూ. 24 కోట్లు, మరియు మున్సిపాలిటీల నుండి రూ. 73 లక్షల గ్రంథాలయ పన్ను బకాయిలు వసూలు కావాల్సి ఉంది.- నిధుల కొరత కారణంగా సిబ్బంది వేతనాలు, పెన్షన్ల చెల్లింపు కష్ట తరంగా మారింది.- జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. దీనికి సొంత భవన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.- మొత్తం 132 మంజూరైన పోస్టులలో 87 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం కేవలం 45 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు.- మన్యప్రాంత మండలాల్లో 10 అత్యాధునిక డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు.- ఉత్తరాంధ్రలో జాతీయ స్థాయి తెలుగు డిజిటల్ లైబ్రరీ నిర్మాణం.- ప్రతి గ్రామ పంచాయతీలో మరియు విశాఖ నగరంలోని ప్రతి వార్డులో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ప్రతి పాదించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ సానుకూలంగా స్పందిం చారు. చదువు సంస్కృతిని కాపాడటంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని, పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదల మరియు గ్రంథా లయాల ఆధునీకరణకు ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఆయన సహాయ సహకారాలు పూర్తిగా ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మన్య ప్రాంతాల్లో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఏబీఎన్ రాధాకృష్ణ క్షమాపణలు చెప్పాలి



**- మహిళలపై నీచమైన భాషలో వికృత ప్రచారాలు**
**- సభ్య సమాజం తలదించుకునేలా అసత్య ప్రేలాపణలు**
**- ప్రజలను డైవర్షన్ చేసేలా ప్రసారాలు**
**- రాధాకృష్ణకు సీఎం, డిప్యూటీ సీఎంల మద్దతుపై ఆగ్రహం**
**- 4వ పట్టణం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన 27వార్డు కార్పొరేటర్ అభ్యర్థి నీలాపు సర్వేశ్వర రెడ్డి.**

**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్) :** మహిళలను కించపరిచేలా, సభ్య సమాజం తలించుకునేలా ఏబీయన్ రాధాకృష్ణ ప్రసారం చేసిన వార్తలతో ఆ ఛానెల్ ఆంధ్రా బ్రోతల్ నెట్ వర్క్ లా తయారైందని, ఇలాంటి వారు మీడియాలో ఉండి సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారో చెప్పా లని వైఎస్సార్సీపీ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, పార్టీని, ముఖ్యంగా పార్టీ నాయకుల భార్యలైన నీఛ నికృష్ణమైన బాషతో దూషించిన వైనాన్ని నిరసిస్తూ, ఏబియన్ రాధాకృష్ణపైన, ప్రచారం చేసిన వ్యక్తులందరిపైన చర్యలు తీసుకోవాలని స్థానిక నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్.. ఈ,మా నాయకుడు అడుగుజాడల్లో నడుస్తూ మేమంతా మావిగన్ కు సపోర్ట్ చేస్తే వైఎస్సార్సీపీ నాయకులను కించపరుస్తూ ఏబీయన్ రాధాకృష్ణ కొత్తపలుకు కార్య క్రమంలో సంస్కారహీనంగా మాట్లాడారని, అలాంటి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండిస్తు న్నామన్నారు. ఏబీయన్ రాధాకృష్ణపై మేము మాట్లాడుతుంటే అదేదో తప్పన్నట్లుగా సీయం, డిప్యూటి సీయంలు ట్విట్టర్ ద్వారా స్పందనలు తెలియచేస్తున్నారని, అయితే తమ పార్టీ నాయకుల రాసలీలలు ప్రతి 15 రోజులకొకసారి బయటకు వస్తున్నాయని, వాటిపై కూడా స్పందించాలన్నారు. అలా కాకుండా పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ వారికి డప్పు కొట్టే ఏబీయన్ కు సంపూర్ణ మద్దతును తెలుపుతూ ఇలా చేయడం సరికాద న్నారు. అమరాతి నిర్మాణం చేసేందుకు సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని చెబుతున్న నాయకులు అంత నగదు ఎక్కడి నుంచి తీసుకొస్తారో చెప్పాలని, ఇది ప్రజలపై భారం కాదా అని, మా నాయకుడు సూచించినట్లుగా అభివృద్దిలో ఉన్న ప్రాంతాన్ని రాజధానిని చేస్తే 10 శాతం ఖర్చుతో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారని, దానిని ఏదో తప్పు చేసినట్లుగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేసి మరీ ఇలా వికృత కార్యక్రమాలతో ప్రజలను డైవర్షన్ చేసేలా చూస్తున్నారని, ఇది సమర్థించదగ్గ విషయం కాదన్నారు. మహిళలను కించపరిచిన రాధా కృష్ణ క్షమాపణ చెప్పాలని, మహిళాభివృద్దికి పెట్టపీట వేస్తున్నామని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వం రాధాకృష్ణ వ్యాఖ్యలపై ఏమి సమాధానం చెబుతారని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాధాకృష్ణకు మద్దతు తెలపడం దారుణమని, ఇదే పంథాలో కొనసాగితే ఆంధ్రరాష్ట్రంలో మహిళా లోకమంతా ఏబీయన్ ఛానెల్ ను బ్యాన్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 27వార్డు పార్టీ కేడర్ పద్మనాభం అమ్మాజీ, అంగటి కుమారి, జయలక్ష్మి, దాసరి విజయ్ భాస్కర్ రెడ్డి, మౌలిష్, త్రినాధ్, పద్మనాభం రాజా,పలికిల వీర్రాజు, ఈతలపాక శివ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




**కాట్రేనికోన, ఏప్రిల్ 9 నేటి మనదేశమ్ :** కాట్రేనికోన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ బి.రాజేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సేవల నిమిత్తం గ్రామపంచాయతీకి వచ్చే ప్రజలకు, బాటసారులకు, వాహనదారులకు ఎండల తీవ్రత దృష్ట్యా చల్లని మజ్జిగ, చల్లని తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జెవివి.సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## యూజేఎఫ్ సేవలు అభినందనీయం

### - శ్రీకాకుళం శాఖ కొత్త కార్యవర్గం ప్రకటన



**శ్రీకాకుళం, ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్) :** ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ సామాజిక బాధ్యతగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షులు, సేల్స్ టాక్స్ అధికారి ఆర్. వేణుగోపాలరావు అన్నారు. గురువారం సాయంత్రం శ్రీకాకుళం ఎన్జీవో హోమ్ లో జరిగిన యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం వాణి వినిపిస్తున్న యూజేఎఫ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్. వర్మ మాట్లాడుతూ మేథావులు, నిపుణుల సూచనలు, సలహాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సమగ్ర నివేదిక ను సంబంధిత అధికారులు, రాజకీయ ప్రముఖులకు అంద జేయడం జరిగిందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఈశ్వరరావు మాట్లాడుతూ...

యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీ స్థాయి లో ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై గొంతు వినిపించిన సందర్భా లను గుర్తు చేశారు. అనంతరం నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షునిగా చౌదరి సత్యనారాయణ. కార్య దర్శిగా బూడుమూరు శ్రీరాముల నాయుడు. కోశాధికారిగా సిపాన సూర్య ప్రకాష్ ఉపాధ్య క్షులుగా రమణమూర్తి. సహాయ కార్యదర్శిగా సూర్యారావు. ఈ కార్య క్రమం లో సీనియర్ జర్నలిస్ట్ ఎంవి. మల్లేశ్వరరావు, యూజేఎఫ్ ప్రతినిధులు రాము,డి. హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు



**కొత్తవలస నేటి మనదేశమ్ ప్రతినిధి :-** కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఎస్ రమణయ్య ఆదేశాలతో చలివేంద్రం ఏర్పాటు చేశారు ఇప్పటికే రోజురోజుకు పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా మేదర్ గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టుపక్కల వివిధ కార్యకలాపాలపై వచ్చేవారికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలు అధికారుల చర్య పై హర్షం వ్యక్తం చేశారు ఈ కార్య క్రమంలో కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం



**భీమునిపట్నం ఏప్రిల్ 09 నేటి మనదేశమ్ :** వైయస్సార్సీపి నాయకులు, మహిళలపై ఏబిఎన్ రాధాకృష్ణ అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి మండల మరియు జీవీఎంసీ1,2,3,4 నాయకులు సంస్కారం మరచి మహిళలను కించపరిచే లాగా రాధాకృష్ణ వ్యాఖ్యలు దుర్మార్గం ఎ బి ఎన్ రాధాకృష్ణ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని మహిళలకు క్షమాపన చెప్పాలనీ.దేశ చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా లేనివిధంగా ఆంధ్రజ్యోతి లో కొత్త పలుకు పేరుతో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్ రెడ్డి నిపార్టీని ముఖ్యంగా పార్టీ నాయకుల భార్యలను నీచ, నికృష్టమైన భాషతో దూషించిన వైనం మీఅందరికీ తెలిసిందే,చేసిన తప్పుకు క్షమాపణ చెప్పకపోగ, మరింత దిగజారి ప్రవర్తిస్తున్న తీరుకు నిరసనగాభీమునిపట్నం మండల అధ్యక్షులు ఎం.పి.పి డి.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు (వాసు రాజు) ఆధ్వర్యంలో భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేసి అనంతరం భీమిలి సి.ఐ తిరుమల రావు కి ఏబీఎన్ రాధాకృష్ణపై కంప్లైంట్ చేసారు.

ఈ కార్యక్రమంలో...

భీమిలి మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, 4వ వార్డ్ మాజీ కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు,అక్కరమాని రామానాయుడు,శిల్లా కరుణాకర్ రెడ్డి, జీవీఎంసీ1,2,3,4 వార్డుల అధ్యక్షులు- జగ్గుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కర్ రెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, పాల రమణారెడ్డి, భీమిలి అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కదిరి ఎల్లాజీ, స్వర్ణలత, మైలపల్లి లక్ష్మణ్ రావు, వాసుపల్లి కొండబాబు, కొండ్రు రామ సూరప్పుడు, ముక్కి కృష్ణ,రాంబుక్త ప్రభాకర్ నాయుడు, శిల్లా వంశీ రెడ్డి, చెల్లూరి గౌరీ నాయుడు, వాడు మొదల జగ్గారావు, మేరుగు చిన్నారావు, బోని సంజీవరావు, జీవీఎంసీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం డిమాండ్

**శ్రీకాకుళం టెక్కలి రూరల్ (శ్రీకాకుళం), ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెంటనే జోక్యం చేసుకొని అకాల వర్షం వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సియటియు నాయుకులు సి.హెచ్.అమ్మన్నాయుడు యన్.వి రమణ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెలమల. రమణ డిమాండ్ చేశారు. గురువారం బుడుమూరు గ్రామంలో ఇటీవల బీభత్సమైన గాలులతో కూడిన అకాల వర్షం వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతూ బుడుముమూరు గ్రామ సచివాలయం వద్ద రైతులు నిరసన తెలియజేసి మండల వ్యవసాయ అధికారి డి మహేష్ నాయుడు, గ్రామ సచివాలయం కార్యదర్శి వి.అప్పలనాయుడులకు వినతిపత్రం అందజేశారు.

# ఎండల్లో చల్ల చల్లటి పానీయాలు



ఎండలు మండుతున్నాయి.. ఇంట్లోనే ఉన్నా చల్లచల్లగా ఏమన్నా తాగాలనిపిస్తుంది. బయటికెళ్ళి వస్తే ఇహ చెప్పనక్కర్లేదు.. ఎన్ని మంచినీళ్ళు తాగినా పొట్ట నిండుతుందే కానీ దాహార్తి తీరదు. కూల్‌డ్రింకుల్లో ఉండే షుగర్, హానికర కెమికల్స్ అవి ఆరోగ్యానికి హానికరం. మనం ఏమన్నా తాగిన తర్వాత ఉపశమనం కలగాలంటే వాటిలో దాహాన్ని తీర్చే విటమిన్‌లు, మినరల్స్ ఉండాలి కదా! అలాంటి చల్లని పదార్థాలు ఇంట్లోనే త్వరగా, తేలికగా చేసుకుంటే అందరికీ మంచిది. మరి ఈ వేసవిలో హాయిగా.. చల్లగా.. ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని చల్లని పానీయాలు ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం.



**మలబార్ అటుకుల డ్రింక్..**

**కావల్సినవి :** మందపాటి అటుకులు–1/2 కప్పు, చల్లని పాలు–1/2 లీటరు, అరటి పండ్లు– 4, పంచదార–8 స్పూన్లు, వేరుశెనగగుండ్లు–1/4 కప్పు, జీడిపప్పు– 10, హార్లిక్స్/ బూస్ట్/ బోర్నవిటా, టూటీఫ్రూటీ – కొద్దిగా.

**తయారీ :** అటుకులను సన్నని సెగ మీద కలుపుతూ కరకరలాడేట్టు వేపుకుని, వేరే గిన్నెలోకి తీసుకోవాలి. అదే పాన్‌లో వేరుశనగ గుళ్ళు వేపుకొని, పొట్టు తీసి పక్కనుంచుకోవాలి. అరటిపండ్లు, పంచదార మరో గిన్నెలో తీసుకుని పప్పుగుత్తితో ఎనిపితే అక్కడక్కడా ముక్కలుగా తగులుతూ బాగుంటుంది. దానికి కాచి చల్లార్చి డీప్‌ఫ్రిజ్‌లో ఉంచిన చల్లని పాలను కలపాలి. అలా కలిపిన పాలను గ్లాసులో సగం వరకూ పోసి, వేయించిన అటుకులు కొంచెం, పల్లీలు, జీడిపప్పు కొన్ని వేసి, మిగిలిన గ్లాసును మరల బనానా పాలతో నింపాలి. పైన మరికొన్ని వేరుశనగపప్పు, జీడిపప్పు, టూటీఫ్రూటీ చల్లి తాగుతుంటే అటుకులు సగం మెత్తగా ఇంకొంచెం కరకరలాడుతూ.. ఆ రుచే వేరులెండి. హార్లిక్స్, బూస్ట్ లాంటివి కూడా అయితే యమ్మీయమ్మీగా భలే రుచిగా ఉంటుంది ఈ అటుకుల సమ్మర్ డ్రింక్.



**పుదీనా కూలర్..**

కావల్సినవి : పుదీనా ఆకులు – కప్పు, కొత్తి మీర – 1/2 కప్పు (చిన్న కట్ట), అల్లం– అంగుళం ముక్క, యాలుకలు – 4, బెల్లం – 60 గ్రా. నీళ్ళు–750 ఎంఎల్, నిమ్మరసం – 2 స్పూన్లు, ఉప్పు – 1/4 స్పూను. పచ్చిమిర్చి – 1, పంచదార – 6 స్పూన్లు,

తయారీ : బెల్లంలో నీళ్ళు పోసి బాగా కరిగించాలి. పుదీనా, కొత్తిమీర, అల్లం ముక్కలు, నిమ్మరసం అన్నీ వేసి మెత్తని పేస్టు చేసుకోవాలి.

ఒక గిన్నెలోకి కరిగిన బెల్లాన్ని వడకట్టుకొని, అందులో పుదీనా పేస్ట్ వేసి కలుపుకోవాలి. ఇలా కలిపిన పుదీనా కూలర్ని మట్టి పాత్రలో అయితే రెండు గంటలు.. ఫ్రిజ్‌లో అయితే గంట ఉంచి, తీసుకుంటే చల్లగా, బాగుంటుంది.



**ఆమ్‌పన్నా..**

కావల్సినవి : పచ్చిమామిడి ముక్కలు –450 గ్రా, అల్లం – అంగుళం ముక్క, ఉప్పు – స్పూను, కారం– 1/4 స్పూను, పచ్చిమిర్చి – ఒకటి, బెల్లం – 40 గ్రా, పంచదార –కప్పు, నీరు –1/2 లీ., పుదీనా – 20 ఆకులు, బ్లాక్‌సాల్ట్ – 1/2 స్పూను

మసాలా కోసం : మిరియాలు – 20, సోంపు %–% 2 స్పూన్లు, జీర –2 స్పూన్లు, యాలకులు – 2 వీటిని దోరగా వేయించి, మెత్తగా పొడి చేసుకోవాలి.

తయారీ : పచ్చిమామిడి ముక్కలు, అల్లం ముక్క, ఉప్పు, కారం, పచ్చిమిర్చి, బెల్లం, పంచదార, నీరు అన్నింటినీ కుక్కర్‌లో ఉడికించాలి. చల్లారిన తర్వాత జార్‌లోకి తీసుకుని, దానికి పుదీనా ఆకులు కూడా కలిపి, మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని వడకట్టి 11/2 లీ. చల్లని నీరు, బ్లాక్ సాల్ట్, ముందుగా వేయించి పొడి చేసుకున్న పొడిని 11/4 స్పూన్లు కలిపి సర్వ్ చేసుకోవటమే. గ్లాసులో ఐసుముక్కలు వేసుకుంటే కూల్ కూల్‌గా కమ్మగా ఉంటుంది.



**రోజ్ షర్బత్..**

**కావల్సినవి :** రోస్ సిరప్–100 మి.లీ., సబ్జా– 2 టేబుల్ స్పూన్లు, నిమ్మ రసం–11/2 స్పూన్లు, ఐసు ముక్కలు – 10, చల్లని నీరు – 600 మి.లీ.

**తయారీ :** సబ్జా గింజలు పది నిమిషాలు నానబెట్టాలి. ఒక గిన్నెలో రోజ్ సిరప్, ఐస్ ముక్కలు, చల్లని నీళ్ళు, సబ్జా, నిమ్మరసం అన్నీ కలపాలి. ఇష్టమయితే సోడా కలుపుకోవచ్చు. మనకు 100 మి.లీల డ్రింక్ తయారీకి 25 మి.లీల రోజ్ సిరప్ ఉండాలి. నిమ్మరసం తెలిసీ తెలియనట్టుంటేనే బాగుంటుంది.

# ఇవి తింటే కంటి సమస్యలు మీ దరి చేరవు



ఒక్కసారి కళ్లు మూసుకొని నడిచి చూడండి. పట్టుమని నాలుగడుగులైనా సరిగా వేయలేం. ఇంద్రియాలన్నింటిలోకీ కన్ను అతి ప్రధానమైనదని అనటానికి ఇదే నిదర్శనం. మనం ఏ పని చేయాలన్నా చూపు చాలా కీలకం. మరి ఇంతటి అమూల్యమైన చూపును ప్రసాదించే కళ్లను సరిగా కాపాడుకుంటున్నామా? నిజానికి లేదనే చెప్పుకోవాలి. ఎందుకంటే కళ్ల గురించి, చూపును దెబ్బతీసే అంశాల గురించి చాలామందికి సరైన అవగాహనే ఉండటం లేదు. పైగా ఎన్నెన్నో అపోహలూ రాజ్యమేలుతున్నాయి. వీటిల్లో నిజమెంతో ఓసారి చూద్దాం.తక్కువ వెలుతురులో చదివితే చూపు తగ్గిపోతుందని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. అయితే మసక వెలుతురులో చదివితే కళ్లు చాలా త్వరగా అలసిపోతాయి. కాబట్టి పుస్తకం మీద నేరుగా వెలుతురు పడేలా లైటును అమర్చుకొని చదువుకోవటం మంచి పద్ధతి కళ్లకు మేలు చేయటంలో క్యారెట్లను మించినవి లేవనేది మరికొందరి భావన. క్యారెట్‌లోని విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి తోడ్పడుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఒక్క క్యారెట్‌లోనే కాదు.. పాలు, ఛీజ్, గుడ్డులోని పచ్చసొన వంటి వాటిల్లోనూ విటమిన్ ఎ ఉంటుంది. అలాగే తాజా పండ్లు, ఆకుకూరలను తక్కువ చేయటానికీ లేదు. వీటిల్లో విటమిన్ సి, విటమిన్ ఈ ఇటువంటి యాంటీ ఆక్సిడెంట్లు పెద్దమొత్తంలో ఉంటాయి. ఇవి వయసుతో పాటు దాడిచేసే శుక్లాలు, రెటీనా మధ్యభాగం క్షీణించటం (మాక్యులర్ డీజెనరేషన్) వంటి సమస్యల బారినపడకుండానూ కాపాడతాయి.

కళ్లద్దాలు లేదా కాంటాక్ట్ లెన్సులను రోజంతా పెట్టుకోవటం మంచిది కాదని, దీంతో కళ్లు వాటికి అలవాటు పడిపోతాయనేది ఇంకొందరి అపోహ. ఇందులో ఏమాత్రం నిజం లేదు. హ్రస్వ దృష్టి లేదా దూర దృష్టి.. సమస్య ఏదైనా డాక్టర్లు సిఫారసు చేసిన కళ్లద్దాలు లేదా లెన్సులు తప్పకుండా వాడుకోవాలి. సాధారణంగా వయసు మీద పడటం వల్లనో, జబ్బుల మూలంగానో కంటి అద్దాల పవర్ మారుతుంటుంది. అప్పుడు కొత్త అద్దాలు తీసుకోవాల్సి వస్తుంది.

అంతే తప్ప కళ్లద్దాలు, లెన్సులతో చూపు తగ్గటం, కళ్లు దెబ్బతినటం వంటి ముప్పులేవీ ఉండవు. పైగా అద్దాలు పెట్టుకోకపోతే కళ్లు ఒత్తిడికి లోనవ్వొచ్చు. అదేపనిగా కంప్యూటర్ వైపు చూడటం కళ్లకు హానికరమని కొందరు భావిస్తుంటారు. దీంతో కళ్లు అలసిపోవటం, ఒత్తిడికి లోనవటం సహజమే గానీ చూపేమీ దెబ్బతినదు.

## కాఫీ బలం!



వృద్ధాప్యంలో బలంగా ఉండాలనుకుంటే మధ్యవయసులో కాఫీ, టీ కాస్త ఎక్కువగా తాగి చూడండి. వీటి రూపంలో కెఫీన్ ఎక్కువగా తీసుకున్నవారికి మలి వయసులో శారీరక బలహీనత తక్కువగా ఉంటున్నట్టు నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ అధ్యయనంలో తేలింది మరి. వృద్ధాప్యంలో సహజంగానే బలం, శారీరక, మానసిక సామర్థ్యం తగ్గుతాయి. దీంతో ఇతరుల మీద ఆధారపడాల్సి వస్తుంటుంది. ఇలాంటి పరిస్థితిని తగ్గించుకోవటానికి కెఫీన్ తోడ్పడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. సగటున 53 ఏళ్ల వయసుగలవారిని ఎంచుకొని దాదాపు 20 ఏళ్ల పాటు పరిశీలించారు. అసలే కాఫీ తాగనివారితో పోలిస్తే– రోజుకు నాలుగు కప్పుల కాఫీ తాగినవారికి వృద్ధాప్యంలో దుర్బలత్వం వచ్చే అవకాశం తక్కువగా ఉంటోందని కనుగొన్నారు. రోజూ టీ తాగేవారిలోనూ ఇలాంటి ఫలితమే కనిపించింది. దీనికి కారణం కెఫీనేనని భావిస్తున్నారు.

## పిల్లలు డీహైడ్రేషన్‌కి గురి కాకుండా..!



ఎండాకాలంలో చిన్నారులు ఆటల్లో పడి ఎండ తీవ్రత తమపై పడుతుందన్న విషయాన్ని పట్టించుకోరు. ఫలితంగా డీహైడ్రేషన్‌కి గురవుతారు. అలాగని చిన్నారుల మానసిక వికాసానికి తోడ్పడే ఆటల నుంచి వారిని దూరం చేయలేం కదా.. అందుకే ఎండ ప్రభావం వారిపై పడకుండా.. వారు డీహైడ్రేషన్‌కి గురికాకుండా.. కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

**ఇవీ డీహైడ్రేషన్ లక్షణాలు..**

అధిక ఉష్ణోగ్రతల్లోనూ శరీరం చల్లగా ఉండేందుకు చర్మం అధిక మొత్తంలో చెమట ఉత్పత్తి చేస్తుంది. అయితే ఇలా చెమట ద్వారా శరీరంలోని నీరు, లవణాలు అధికమొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్‌కి గురవుతాం. వేసవిలో చిన్నారులు డీహైడ్రేషన్‌కి గురవు తున్నారనే విషయాన్ని మనం ముందుగానే గుర్తించవచ్చు. నీరసంగా కనిపించడం, నోరు పొడిగా తయారవడం, మూత్రవిసర్జన తక్కువగా ఉండడం, వాంతులు చేసుకోవడంతో పాటు చిరాగ్గా ఉన్నట్టు కనిపిస్తే.. వారు డీహైడ్రేషన్‌కి గురవుతున్నట్లుగా గుర్తించాలి. ఈ సమయంలో వారిని ఆటలకు కాస్త బ్రేక్ ఇవ్వమని చెప్పి నీరు, మజ్జిగ, పండ్లు వంటివి వారికి అందించాలి. అవసరమైతే వైద్యున్ని సంప్రదించాల్సి ఉంటుంది.

**15 నుంచి 20 నిమిషాలకోసారి.. :** శరీరం నుంచి చెమట ద్వారా బయటకు వెళ్లిపోయిన నీటి లోటును ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సి ఉంటుంది. లేదంటే డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే చిన్నారులకు దాహం వేస్తున్నా వేయకపోయినా.. ప్రతి పావుగంట నుంచి ఇరవై నిమిషాలకోసారి గ్లాసు నీటిని తాగమని వారికి అందించాలి. ఎప్పుడూ నీటిని తాగడానికి చిన్నారులు అంత ఆసక్తి చూపించకపోవచ్చు. అందుకోసం మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, కీరా–పండ్ల ముక్కల్ని నీటిలో వేసి అందించడం వంటివి కూడా అవసరం. అలాగే నీటిశాతం ఎక్కువగా ఉన్న పుచ్చ, తర్బూజా లాంటి పండ్లను కూడా వారికి అందించాలి. వేసవిలో కూల్‌డ్రింక్‌లను చిన్నారులకు అందించకపోవడమే మంచిది. ఎందుకంటే వీటిలో ఉండే కెఫీన్ సహా ఇతర పదార్థాలు చిన్నారుల్లో డీహైడ్రేషన్‌కు కారణమవుతాయి.

ఇవి కూడా..? వేసవిలో ఎక్కువ సమయం ఆటల్లోనే గడిపే చిన్నారుల వస్త్రధారణ విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంత వరకు వారికి లేత రంగుల్లో ఉన్న నూలు వస్త్రాలనే తొడగాలి. అవి కూడా వదులుగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వారిపై పడకుండా ఉంటుంది.

నాలుగు నుంచి ఐదు గంటల పాటు ఏమీ తినకుండా, తాగకుండా చిన్నారులు ఉన్నట్లైతే వారు డీహైడ్రేషన్‌కి గురయ్యే అవకాశం ఉంది. కాబట్టి వారికి సరైన సమయానికి ఆహారం, నీరు అందించాలి.

## కొబ్బరినీళ్లు... ముఖానికి రాస్తే





అలసటగా అనిపించినప్పుడు కొబ్బరినీళ్లు తాగితే నిమిషాల్లో తేరుకున్నట్లు అనిపిస్తుంది కదూ! అవి శరీరానికి అందించే పోషకాలూ బోలెడు. చర్మ సంరక్షణలోనూ ఈ ప్రకృతి సిద్ధమైన నీళ్లు సాయపడతాయని తెలుసా? ఎలాగంటే...

అప్పటికప్పుడు చర్మం తాజాగా కనిపించాలంటే చాలామంది ఆశ్రయించేది 'మిస్ట్'నే! కొబ్బరి నీటితో దీన్ని సహజంగా తయారుచేసుకోవచ్చు. ఒకవంతు చొప్పున కొబ్బరినీళ్లు, రోజ్‌వాటర్ తీసుకుని... ఈ మిశ్రమానికి కొన్ని చుక్కలు నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్‌ని కలపాలి. దీన్ని ఓ స్ప్రే బాటిల్‌లో పోసుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుంటే సరి. స్కిన్‌కేర్ రొటీన్, మేకప్‌లకు ముందైనా... చర్మం అలసటగా కనిపించినప్పుడైనా అలా ముఖంపై స్ప్రే చేసుకుంటే సరి. ఇది చర్మానికి కావాల్సిన పోషకాలతో పాటు తేమనీ అందిస్తుంది.

మొటిమలు మరీ ఇబ్బంది పెడుతున్నాయా? పావు చెంచా పసుపు, అరచెంచా గంధం తీసుకొని, తగినన్ని కొబ్బరి నీళ్లతో పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, పావుగంటయ్యాక కడిగేస్తే సరి. కొబ్బరి నీటిలోని విటమిన్– సి, అమైనో యాసిడ్స్, యాంటీ మైక్రోబియల్ గుణాలు యాక్నే, మొటిమలను పోగొట్టడంలో సాయపడతాయి. మచ్చలనీ త్వరగా దూరం చేస్తాయి. కేశాల ఆరోగ్యానికి తరచూ కొబ్బరి నూనె రాయటం మనకు మామూలే. ఈసారి కొబ్బరి నీటిని ప్రయత్నించండి. వీటిలోని మినరల్స్ మాడును ఆరోగ్యంగా ఉంచడమే కాదు, కుదుళ్లనూ దృఢంగా మారుస్తాయి. కొబ్బరి నీళ్లను మాడుకి పట్టించి మృదువుగా మర్దన చేస్తే చాలు. ఈ నీళ్లు వెంట్రుకలు చిక్కుపడటం, బరకగా గడ్డిలా మారడం, చిట్లడం వంటి వాటినీ అరికడతాయి. చలికాలంలోనే కాదు, వేసవిలో చెమటకీ కొందరిని చుండ్రు పలకరిస్తుంటుంది. అలాంటప్పుడు కొబ్బరి నీటితో మంత్రం వేయండి. సమపాళ్లలో కొబ్బరినీళ్లు, యాపిల్ సిడార్ వినెగర్ తీసుకుని తలస్నానానికి పావుగంట ముందు తలకు పట్టించాలి. తరవాత చల్లటినీళ్లు, గాఢత తక్కువున్న షాంపూతో కడిగేస్తే సరిపోతుంది. కొబ్బరినీటిలోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుకు చెక్ పెట్టేస్తాయి.

## బరువు పెరగకుండా ఉండాలంటే ఏం చేయాలి..!



ఉద్యోగులు చాలామంది ఆఫీస్‌లో దాదాపు పనిగంటలన్నీ కుర్చీల్లోనే గడిపేస్తుంటారు. లంచ్ బ్రేక్, టీ బ్రేక్ వంటి విరామాల్లో తప్ప ఎక్కువ సమయం కూర్చునే ఉంటారు. దీంతో బరువు పెరిగే సమస్యను ఎదుర్కొంటారు. శారీరక శ్రమ లేకుండా అధిక క్యాలరీలు తీసుకుంటే అది శరీరంలో కొవ్వు పేరుకుపోయేందుకు దారి తీస్తుంది. ఊబకాయం సహా పలు అనారోగ్యాలకు దారి తీస్తుంది. అయితే మనం తీసుకునే ఆహారంతో పాటు జీవనశైలి మార్పులతో అధిక బరువు దరిచేరకుండా నిరోధించవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

## పూల ఐస్ ఫ్రూట్



మీకు పాల ఐస్ తెలుసు పూల ఐస్ తెలుసా? ఐస్‌ఫ్రూట్ తినే ఉంటారు. ఫ్రూట్ ఐస్ గురించి విన్నారా? అయితే మండే ఎండల్లో ఈ చల్లచల్లటి సంగతులు తెలుసుకోవలసిందే. ఇటీవల సోషల్ మీడియాలో ట్రెండ్ అయిన మామిడి పండును పోలిన ఐస్‌క్రీమ్‌లాగే రకరకాల ఫలాలను పోలిన హిమక్రీములు, పూలని పోలిన మంచు మిఠాయిల్ని కూడా తయారు చేస్తున్నారు. చూస్తే హాయిగా, తింటే చల్లగా ఉండే వీటి విశేషాలు మీ కోసం

కొందరికి ఐస్‌క్రీమ్ ఎప్పుడూ ఫేవరెట్టే. కానీ అది అందరికీ నచ్చేది మాత్రం ఎండా కాలంలోనే. ఎండల్లో హాయ్ హాయ్‌గా అనిపించాలంటే వెన్నెలలాంటి వెనీలానో, రాత్రిలాంటి డార్క్ చాక్లెట్టో పొట్టలో పడాల్సిందే!

## ఆరు రకాలు ఒకే చెట్టుకు!



జామచెట్టుకు జామ, సపోటా చెట్టుకు సపోటాలే కాస్తాయి. చెట్టొకటి అయితే పండు ఇంకొకటి రాదు. కానీ.. ఒక చెట్టుకు ఆరు రకాల పండ్లు వస్తే? ఇదేం ఫాంటసీ సినిమానా అనుకుంటున్నారా? అలాంటివి నిజం చేసి చూపిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఆస్ట్రేలియాలో ఎక్కువ అంట్లు కట్టడం (మల్టీ గ్రాఫ్టెడ్) అనే పద్ధతిలో ఒక చెట్టుకు ఆరు రకాల పండ్లు వచ్చేలా అభివృద్ధి చేశారు.

వీటిని 'ఫ్రూట్ సలాడ్ ట్రీస్' అంటారు. గమ్మత్తేమిటంటే ఒకే చెట్టుకు కాసినప్పటికీ ఆయా పండ్లు.. రంగు, రూపం, రుచి, వాసన.. ఎందులోనూ సహజత్వాన్ని కోల్పోవు. వీటిని నేల మీదే కాదు, కుండీల్లోనూ పెంచవచ్చు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు రక్షణశాఖ గ్రీన్‌సిగ్నల్

**- వీలైనంత త్వరగా శంకుస్థాపన - ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టెర్మినల్**
**- కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 09 :** ఆదిలాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ ముందుకు వచ్చిందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. బుధవారం ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్ వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం కావడంతో శిక్షణ కేంద్రంతో పాటు, పౌర విమానాల సేవల కోసం అభివృద్ధి చేయాలని రక్షణశాఖ ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. సామాన్య ప్రజల కోసం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) టర్మినల్ బిల్డింగ్ నిర్మిస్తుందన్నారు. ఈ నెల 17న.. విమానయాన, రక్షణ శాఖ అధికారులతో కూడని బృందం ఆదిలాబాద్‌లో పర్యటించి ఓఎల్ఎస్ సర్వే చేస్తారని, అనంతరం రన్‌వే ఓరియంటేషన్, మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన అదనపు 450 ఎకరాల భూమిని రాష్ట్రప్రభుత్వం త్వరగా అప్పగించాలని కోరామని, అందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. తెలంగాణకు ముఖద్వారంగా ఉన్న ఆదిలాబాద్‌లో విమానాశ్రయం అందుబాటులోకి వస్తే భవిష్యత్‌లో వాణిజ్యపరంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు ఒకే విమానశ్రయం ఉందన్న భావన ప్రజల్లో ఉందని, వారి డిమాండ్‌కు అనుగుణంగా.. విమానశ్రయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. వరంగల్‌లో మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, మరో 3 నెలల్లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. పెద్దపల్లిలోని అంతర్గాం వద్ద ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు నిర్వహించిన అధ్యయనంలో సానుకూల ఫలితాలు వచ్చాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వ తుదినిర్ణయం కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగూడెంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయానికి అనుకూలం కాదని స్పష్టం చేశారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాస్తుల కేసు..
# ఏసీబీ కస్టడీకి దేవాదాయ శాఖ అధికారిణి శాంతి?





**విజయవాడ, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కళింగిరి శాంతి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమ ఆస్తుల వ్యవహారంలో మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు శాంతిని ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అనుమతించాలని ఏసీబీ కోరింది. సోదాల సమయంలో లభించిన పత్రాలు, ఆస్తుల వివరాలపై ఆమె సరైన సమాధానాలు ఇవ్వలేదని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు (గురువారం) ఏసీబీ న్యాయస్థానం విచారణ జరపనుంది. సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న కొన్ని స్థిరాస్తులు, డాక్యుమెంట్ల గురించి శాంతి స్పష్టమైన వివరణ ఇవ్వలేదని, ఆమె నోరు విప్పితే మరిన్ని అక్రమాలు బయటపడతాయని అధికారులు భావిస్తున్నారు. గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికై దేవాదాయ శాఖలో చేరిన నాటి నుంచే ఆమె భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పనిచేసిన సమయంలో ఆమె ఈ అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. గత కొన్ని రోజులుగా కళింగిరి శాంతి నివాసాలు, బంధువుల ఇళ్లలో జరిగిన సోదాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు బయట పడిన సంగతి తెలిసిందే. విధుల్లో చేరిన తక్కువ కాలంలోనే ఒక గ్రూప్-1 అధికారి ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఎలా సంపాదించారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. నేడు కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా శాంతిని ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు.

ఈ విచారణలో మరికొంత మంది దేవాదాయ శాఖ అధికారుల హస్తం ఉందా లేదా అనే విషయాలు కూడా వెలుగు చూసే అవకాశం ఉంది.

# కొయ్యూరు సిడిపిఓ దేవమణి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ



**కొయ్యూరు, ఏప్రిల్ 09, నేటి మనదేశమ్.:** 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కొయ్యూరు సి డి పి ఓ దేవమణి ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాజేంద్రపాలెం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిసిసి మాజీ చైర్మన్ శ్రీ ఎం వి వి ప్రసాద్ మరియు తాహసిల్దార్ మురళి బాబు, డాక్టర్ జగదీష్ , మాజీ ఎంపిటిసి శివరామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జిసిసి చైర్మన్ మాట్లాడుతూఈ కార్యక్రమం ఈనెల 9వ తారీఖు నుంచి 23వ తారీకు వరకు ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని సెంటర్లో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈరోజు ఈ కార్యక్రమం యొక్క ప్రధాన అంశం తల్లి మరియు శిశు పోషణ లో భాగంగా గర్భధారణ సమయంలో ఆహారం మరియు సంరక్షణ, గర్భిణీ పరీక్షల ప్రాముఖ్యత, పుట్టిన బిడ్డ కు పూర్తిగా తల్లిపాలు ఇవ్వడం, సరైన వయసులో అనుబంధ ఆహారం ప్రారంభించడం వంటి సూచనలును గర్భిణీలకు , బాలింతలకు సిడిపిఓ గారు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసాద్ గారు మాట్లాడుతూ గర్భిణీలు సరైన సమయంలో పరీక్షలు చేసుకోవాలని అందుబాటులో ఉన్న ఆసుపత్రిలోనే డెలివరీలు చేసుకోవాలి మరియు గర్భిణీలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్.సి లో ఉన్న గర్భిణీలు, బాలింతలు, సూపర్వైజర్లు, సిహెచ్ఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

# సోలాబులో సబ్ డిఆర్ డిపో ఏర్పాటు. ...ఆనందంలో గ్రామస్తులు



**కొయ్యూరు, ఏప్రిల్ 09, నేటి మనదేశమ్.:** మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ లో సోలాబు, జోగంపేట గ్రామాలల, గ్రామ ప్రజలు ప్రభుత్వం, సరఫరా చేసే రేషన్ కోసం, గత కొన్ని సంవత్సరాలుగా, రాజేంద్రపాలెం లో రేషన్ సరుకులు తీసుకునేవారు. అయితే రేషన్ కొరకు, గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నామంటూ, రాజేంద్రపాలెం రావాలంటే ,10 కిలో మీటర్లు ప్రయాణించవలసి వస్తుందన్నారు . డి ఆర్ డిపో సొలబు లో ఏర్పాటు చేయాలని, నర్సి కృష్ణకు తెలియజేయడంతో, ఆ సమస్యను తహశీల్దార్ మురళీబాబు దగ్గరికి వెళ్లి, సొలాబు గ్రామస్థులకు అక్కడే డి ఆర్ డిపో ఏర్పాటు చేయా లని విన్నవించు కోవడంతో, రెవిన్యూ అధికారులు సొలబులో డిఆర్ డిపో ఏర్పాటు చేశారు. డిపో సొలబు కు తీసుకు రావడానికి, ఎంతో కష్టపడి ప్రయత్నించిన నర్సి కృష్ణకు, అలాగే రెవిన్యూ అధికారు లకు గ్రామస్తులంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి . విజయ్ కుమార్ తో పాటు, లక్ష్మీ, బుజ్జి బాబు, రాజేష్, కామేష్, రంగారావు, పీ. వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఏయూ విద్యార్థులు నాయకులుగా ఎదగాలి

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు నాయకులుగా ఎదగాలని, విజయాలు సాధించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. ఎయు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్‌లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిఆర్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి రామన్ వంటి వ్యక్తులు ఇక్కడ తమ మేధస్సుతో విశ్వవిద్యాలయాన్ని నడిపించారని కొనియాడారు. మీరంతా ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తు అని, ఇక్కడ గడిపేసమయం మీ జీవితంలో అత్యంత ముఖ్యమైన సమయం అని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యత విద్య అందిస్తుందన్నారు. ఎయు ప్రాంగణం ఒక క్యాంపస్ మాత్రమే కాదని, విలువలతో దేశ నిర్మాణంలో సైతం ముఖ్య భూమిక పోషించిందని తెలిపారు. శతాబ్ద కాలాన్ని పూర్తిచేసుకొని భారతీయ వారసత్వ సంపదకు నిదర్శనంగా ఏయు నిలిచిందని కొనియాడారు. వివిధ రంగాలలో సమాజాన్ని ముందు నిలిపే నాయకులుగా ఎందరో ఇక్కడినుండి ఎదిగారని, అటువంటి వ్యక్తులుగా మీరుకుడా ఎదగాలని సూచించారు. మీ ధ్యేయం సమాజ సేవ కావాలని, మీ జ్ఞానం మీ కోసమే కాకుండా, సమాజానికి దేశానికి ఉపయుక్తంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. టెక్నికల్, కల్చరల్, అవుట్‌రీచ్ విభాగాలు నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కల్చరల్ ఫెస్టివల్ చైర్మన్ ఆచార్య ఎన్.విజరు మోహన్, రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాం బాబు, ఫెస్ట్ కో చైర్మన్ ఆచార్య ఎ.పల్లవి, కన్వీనర్లు ఆచార్య ఎన్ఎం యుగంధర్, సిహెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు, విజరు కుమార్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.... కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేదికపై ప్రదర్శించిన వివిధ గీతాలకు విద్యార్థినులు నృత్యాలు చేస్తూ కనిపించారు. ఆహ్లాదకర వాతావరణంలో ఫెస్ట్ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం యువత కేరింతలతో హోరెత్తింది.

# జగన్మోహన్ రెడ్డిని కలిసిన వడ్డి రఘురామ్ నాయుడు



**తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** వైసిపి కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నియోజక వర్గ నాయకులతో బుధవారం మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సుమారు 250 మంది వైసిపి స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానిక పరిస్థితులపై మాట్లాడతూ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శేషులత, నియోజకవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# త్వరలో 5 కిలోల సిలిండర్లు..
# కిరోసిన్ పంపిణీ

**- గ్రామాలకు సిలిండర్ల డెలివరీలో జాప్యంపై దృష్టి**
**- జేసీలతో మంత్రి మనోహర్**



**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఎల్పీజీ ఏజెన్సీలతో సంయుక్త కలెక్టర్లు నిత్యం సమీక్షించాలని.. ప్రజలను ఇబ్బంది పెడుతూ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ల డెలివరీలో జాప్యం జరుగుతోంది. బుకింగ్స్, డెలివరీలను రోజూ అప్‌డేట్ చేసే వ్యవస్థ అందుబాటులోకి రావాలి' అని చెప్పారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, రబీ ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై బుధవారం ఆయన కమిషనరేట్ నుంచి జిల్లాల సంయుక్త కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆయిల్ సంస్థలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్రం 5 కిలోల సిలిండర్ల పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. అవసరమైనవారికి వీటిని మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేయాలి. కిరోసిన్ సరఫరాకు కూడా కేంద్రం సిద్ధంగా ఉంది. పాడేరు వంటి ప్రాంతాల్లో కిరోసిన్ అవసరం ఉంటుంది. ఇంకా ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి పంపిణీకి చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించామని.. రబీలోనూ అదే స్ఫూర్తి కొనసాగించాలని మంత్రి మనోహర్ అధికారులను కోరారు. 'అకాల వర్షాలు పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలి. రైతులకు ఇబ్బంది రాకూడదు' అని పేర్కొన్నారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

**- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం - డిప్యూటి సిఎం భట్టి విక్రామార్క వెల్లడి**





**ఖమ్మం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్దంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్టును గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకు వస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగు తోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

## డెకాయిట్ సరిచేయాల్సిన లెక్కలు



రేపు విడుదల కాబోతున్న డెకాయిట్ మీద ట్రేడ్ వర్గాలే కాదు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బుక్ మై షోలో ఆల్రెడీ ట్రెండింగ్ లో ఉండగా క్రమంగా నెంబర్లు పెరుగుతూ పోవడం శుభసూచకంగా చెప్పుకోవాలి. అంచనాలు మరీ అరివీరభయంకరంగా ఉన్నాయని చెప్పలేం కానీ అడివి శేష్ బ్రాండ్ తో పాటు ట్రైలర్ లో చూపించిన లవ్, యాక్షన్ కంటెంట్ దీన్ని థియేటర్ ఎక్స్ పీరియన్స్ చేయాలనే నమ్మకాన్ని ఆడియన్స్ లో కలిగించింది. అదే ప్లస్ గా మారింది. డెకాయిట్ సరిచేయాల్సిన లెక్కలు చాలానే ఉన్నాయి. మొదటిది అడివి శేష్ హిట్ 2 తర్వాత మూడేళ్ల పాటు దీన్ని నిర్మాణంలో ఉంచిన గ్యాప్ కి న్యాయం జరిగేలా కంటెంట్ ఉందని జనాలు భావించాలి. రెండోది నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈసారి తండ్రి, మావయ్య ప్రమేయం లేకుండా స్వంతంగా అన్నపూర్ణ, ఎస్ఎస్ క్రియేషన్స్ బ్యానర్ల సంయుక్త నిర్మాణంలో ప్రొడక్షన్ మొత్తం తనే చూసుకుంది. ప్రొడ్యూసర్ గా ఈ అడుగు ఎలా ఉంటుందోనని ఇతర నిర్మాతలు వేచి చూస్తున్నారు. మూడోది ఏ బ్రాండ్ ఇమేజ్ లేని దర్శకుడు షానియేల్ డియో పనితనం. డైరెక్షన్ అనుభవం ఎక్కువగా లేకపోయినా ఇంత పెద్ద యాక్షన్ గ్రాండియర్ ని అది కూడా సీనియర్ మోస్ట్ ఆర్టిస్టులతో తెరకెక్కించడం పెద్ద సవాల్. శేష్, నాగార్జున, సుప్రియ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. నాలుగోది మృణాల్ ఠాకూర్ టేస్ట్. సీతారామం, హాయ్ నాన్న లాంటి క్లాసిక్స్ చేశాక ఫ్యామిలీ స్టార్ రూపంలో తనకో డిజాస్టర్ పడింది. ఇప్పుడు మళ్ళీ ట్రాక్ లోకి రావాలంటే డెకాయిట్ చేయి అందించాలి. ఇలా ఇన్నేసి క్యాలికులేషన్లు డెకాయిట్ మీద ఉన్నాయి. గత వారం రిలీజైన బైకర్, రాకాస చెప్పుకోదగ్గ టాక్ తో మొదటి వీకెండ్ బండి లాగినప్పటికీ తర్వాత స్లో అయ్యాయి. రెండో వారాంతంలో ఏ మేరకు పికప్ అవుతాయనేది డెకాయిట్ రిజల్ట్ మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ శేష్ మూవీ కనక హిట్ అనిపించుకుంటే ఆటోమేటిక్ గా ఆడియన్స్ ఫస్ట్ ఛాయస్ ఇదే అవుతుంది. టీమ్ కాన్ఫిడెన్స్ చూస్తుంటే నమ్మకాలు నిజమయ్యేలానే ఉన్నాయి. రేపు ఉదయం ఎనిమిది నుంచి షోలు స్టార్ట్ కాబోతున్నాయి.

## దురంధర్ భామకు శ్రీలీల పంచ్?





చాలా తక్కువ సమయంలోనే పెద్ద హీరోయిన్‌గా ఎదిగినప్పటికీ.. చాలా అణకువతో వ్యవహరించే అమ్మాయి శ్రీలీల. ఇప్పటిదాకా ఆమె ఎలాంటి వివాదంలోనూ చిక్కుకోలేదు. ఎప్పుడూ అదుపు తప్పి మాట్లాడింది లేదు. ఎవరికీ పంచ్ వేసింది లేదు. కానీ తొలిసారి ఆమె చేసిన కామెంట్ కొంచెం వివాదాస్పదం అయింది. సినిమాల్లో నటించే అమ్మాయిలకు పీరియడ్స్ అన్నవి ఒక సాకు కాదు అంటూ ఆమె తాజాగా కామెంట్ చేసింది. శ్రీలీల ఇలా మాట్లాడ్డం వెనుక ఒక నేపథ్యం ఉంది. తెలుగులో ‘ఓం భీం బుష్’ సహా కొన్ని చిత్రాల్లో నటించిన ముంబయి భామ ఆయేషా ఖాన్.. బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ ‘దురంధర్’లో ఒక ఐటెం సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పాట చేసేటప్పుడు తాను పీరియడ్స్‌లో ఉన్నానని.. అయినా ఆ ఇబ్బందితోనే కష్టమైన డ్యాన్స్ మూమెంట్స్ చేశానని ఆయేషా చెప్పడం చర్చనీయాంశం అయింది. చాలామంది ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. ఆమె కమిట్మెంట్‌ను కొనియాడారు. కానీ కొందరు మాత్రం ఇదేమంత విషయం అన్నట్లుగా కామెంట్లు చేశారు. పీరియడ్స్‌లో ఉంటూ అంతకుమించి కష్టం పడే మహిళలు మన చుట్టూ లేరా, దాన్నో పెద్ద విషయంలా చెప్పడమేంటి అన్నట్లుగా మాట్లాడారు. ఐతే ఎవరో ఊరూ పేరు లేని వాళ్లు ఇలాంటి కామెంట్లు చేస్తారు కానీ.. ఒక పేరున్న హీరోయిన్, పైగా ఎంబీబీఎస్ చదువుకున్న శ్రీలీల ఇదే తరహాలో కామెంట్ చేయడమే వివాదానికి దారి తీసింది. ఒక మహిళగా తాను ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని.. తాను పీరియడ్స్‌లో ఉండగా ఎన్నో పాటలకు డ్యాన్స్ చేశానని.. దాన్నొక సాకుగా చూపించే అవకాశం లేదని ఆమె స్పష్టం చేసింది. శారీరకంగా, మానసికంగా అన్ని సవాళ్లకూ సిద్ధంగా ఉండాలని శ్రీలీల అభిప్రాయపడింది. ఆయేషాకు కౌంటర్‌గా ఉద్దేశపూర్వకరంగానే శ్రీలీల ఈ వ్యాఖ్యలు చేసిందో లేదో కానీ.. అందరూ దానికే కనెక్ట్ చేసుకుంటున్నారు. ఒక మహిళ, పైగా డాక్టర్ అయి ఉండి ఇలాంటి కామెంట్లు చేయడమేంటి అంటూ ఆమెను కొందరు తప్పుబడుతున్నారు.

## పెద్ది ఐటమ్ సాంగ్.. ఏదో అనుకుంటే



ప్రస్తుతం టాలీవుడ్లో తర్వాత రాబోయే పెద్ద సినిమా.. పెద్దినే. వేసవికి షెడ్యూల్ అయిన ఏకైక పెద్ద చిత్రమిది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 30కి వాయిదా పడ్డ ఆ మూవీ.. ఈ డేట్‌కు కూడా కట్టుబడి ఉంటుందా అన్నది సందేహంగానే ఉంది. వాయిదా లాంఛనమే అంటున్నారు. మరి కొన్ని రోజుల్లో కొత్త డేట్ ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ దిశగా అభిమానులను ముందే ప్రిపేర్ చేసేసిన టీం.. మిగతా పనుల మీద దృష్టిసారించింది. ఈ చిత్రంలో అదిరిపోయే ఐటెం సాంగ్ ఉంటుందని.. అందులో డ్యాన్సులు అదిరిపోతాయని కొన్ని రోజుల ముందే సమాచారం బయటికి వచ్చింది. ఈ పాటలో చరణ్‌తో పాటు డ్యాన్స్ చేసే హీరోయిన్‌కు సంబంధించి రకరకాల పేర్లు వినిపించాయి. చివరగా మృణాల్ ఠాకూర్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటిదాకా తెలుగులో గ్లామర్ పాత్ర చేయని మృణాల్.. తొలిసారి ఐటెం సాంగ్ చేస్తే ఎలా ఉంటుందా అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఐతే మృణాల్ ‘పెద్ది’ పాట చేయబోతోందని ఫిక్సయిపోయి భారీ అంచనాలతో ఉన్న మెగా అభిమానులకు దర్శకుడు బుచ్చిబాబు సానా పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో మృణాల్ నర్తించదట. ‘కపుల్ ఫ్రెండ్లీ’తో మంచి గుర్తింపు సంపాదించిన తెలుగమ్మాయి మానస వారణాసిని ఈ పాటలో చూడబోతున్నామట. ప్రేక్షకుల అంచనాలకు భిన్నంగా మానసను ఈ పాట కోసం ఓకే చేశారట. మానస కెరీర్లో తొలి అడుగులు వేస్తున్న అమ్మాయి. ఆమె ఇప్పటిదాకా తెలుగులో చేసిన రెండు సినిమాల్లో తన గ్లామర్ హైలైట్ అవ్వలేదు. ‘కపుల్ ఫ్రెండ్లీ’లో అయితే ఒక మామూలు మధ్య తరగతి అమ్మాయిలా కనిపించింది. పెర్ఫామెన్స్‌తో మెప్పించింది. ఆమె ఐటెం సాంగ్‌లో కనిపించడం అన్నది కచ్చితంగా షాకే. దీన్ని మెగా ఫ్యాన్స్ ఎలా తీసుకుంటారో చెప్పలేం. ఇప్పటికైతే ఇది కేవలం సమాచారం మాత్రమే.. ఎంతవరకు లాక్ అయ్యిందో అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. చాలా ఏళ్లుగా ఐటెం సాంగ్స్ కూడా పెద్ద హీరోయిన్లే చేస్తున్నారు. చరణ్ సినిమా అంటే స్పెషల్ సాంగ్ చేసే హీరోయిన్‌కు కూడా ఒక రేంజ్ ఉండాలని ఫ్యాన్స్ ఆశిస్తారు. కానీ బుచ్చిబాబు వారి ఆకాంక్షలకు భిన్నంగా వెళ్తున్నాడు. మరి మానస ఎలా మెప్పిస్తుందో.. తెరపై ఈ పాట ఎలా పండుతుందో చూడాలి.




## డోస్ సరిపోలేదు రాకా




‘పుష్ప-2’ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ సినిమా మీద ఏ స్థాయిలో అంచనాలు ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. త్రివిక్రమ్ సినిమాను హోల్డ్‌లో పెట్టి మరీ అట్లీతో బన్నీ జట్టు కట్టడంతో అది చాలా ప్రత్యేకమైన సినిమానే అయి ఉంటుందని అభిమానులు భావించారు. ఇప్పటిదాకా అట్లీకి ఫెయిల్యూర్ అన్నదే లేదు. ‘రాజా రాణి’ నుంచి ‘జవాన్’ వరకూ అన్నీ బ్లాక్‌బస్టర్లే. కాకపోతే అట్లీ సినిమాలు రొటీన్‌గా ఉంటాయని.. సగటు కమర్షియల్ మీటర్‌ను దాటి ముందుకు వెళ్లడనే విమర్శలు ఉన్నాయి. కానీ ఈసారి అట్లీ సగటు మాస్ మసాలా సినిమాకు పరిమితం కాకుండా బన్నీ రేంజికి తగ్గట్లు ఒక భారీ ఈవెంట్ ఫిల్మ్ చేయడానికే రెడీ అయ్యాడు. అతను ఏదో స్పెషల్‌గా ట్రై చేస్తున్నాడని.. సినిమాను అనౌన్స్ చేసినపుడే అర్థమైంది. పెద్ద పెద్ద హాలీవుడ్ స్టూడియోలను ఈ సినిమాలో ఇన్వాల్వ్ చేశారు. ఏకంగా రూ.800 కోట్ల బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. ఐతే ఈ సినిమా గురించి ఇప్పటిదాకా జనాలు ఊహించుకున్న రేంజిలో అయితే నిన్న రిలీజ్ చేసిన టైటిల్ లుక్ లేదన్నది వాస్తవం. బన్నీ సినిమా నుంచి తొలి విశేషాన్ని పంచుకున్నపుడు సోషల్ మీడియా షేక్ అయిపోతుందనే సంకేతాలను టీం వర్గాలు ఇచ్చాయి. కానీ నిన్న అలా జరగలేదు. ముందు సినిమా నుంచి వీడియో గ్లింప్స్ కాకుండా టైటిల్ లుక్ మాత్రమే రిలీజ్ చేయడంతోనే సగం ఆసక్తి తగ్గిపోయింది. ఇక టైటిల్, బన్నీ లుక్‌కు ఎక్కడెక్కడో పోలికలు కనిపించడంతో ఒక రకమైన నిట్టూర్పు కనిపించింది అభిమానుల్లో. తాము అంచనా వేసినట్లు నిన్న సోషల్ మీడియా షేక్ కాకపోవడంతో ఫ్యాన్స్ డిజప్పాయింట్ అయ్యారు. సోషల్ మీడియా ట్రెండ్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండే బన్నీ టీంకు ఈ ఫీడ్ బ్యాక్ అందకుండా ఉండదు. ఈ ప్రాజెక్టు స్కేల్‌కు తగ్గట్లు తర్వాత ఏదో భారీగా చేస్తే తప్ప సినిమాకు కోరుకున్న హైప్ రాదు. ఇంతకుముందు ఊరించి ఊరించి ప్రస్తుతానికి పక్కన పెట్టి గ్లింప్స్ విషయంలో అట్లీ అండ్ టీం చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిందే. దాన్ని వావ్ అనిపించే స్థాయిలో తీర్చిదిద్ది మంచి సందర్భం చూసి రిలీజ్ చేయాలి.



# బిజినెస్ న్యూస్



## Q4లో అదరగొట్టిన TCS.. ఒక్కో షేరుకు రూ.31 డివిడెండ్




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గానూ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభంలో 12.22 శాతం వృద్ధి కనబరిచింది. గతేడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.12,224 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించగా.. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.10, 657 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.49,210 కోట్ల నికర లాభం పొందింది. సమీక్షిస్తున్న త్రైమాసికానికి గానూ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 9.64 శాతం వృద్ధితో రూ.64,479 కోట్ల నుంచి రూ.70,698 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 4.58 శాతం వృద్ధితో రూ.2.67 లక్షల కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ కంపెనీ ఒక్కో షేరుకు రూ.31 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో 12 బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు కంపెనీ సీఈఓ కృతివాసన్ వెల్లడించారు. కృత్రిమ మేధ సంబంధిత సేవల ద్వారా వచ్చే వార్షిక ఆదాయం 2.3 బిలియన్ డాలర్లు దాటినట్లు వెల్లడించారు. నాలుగో త్రైమాసికంలో నికరంగా 2,000 మందికి పైగా ఉద్యోగులు కంపెనీలో చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,84,519కి చేరింది. అయితే, వలసల రేటు (అట్రిషన్ రేటు) స్వల్పంగా పెరిగి 13.7 శాతానికి చేరింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కంపెనీ షేరు విలువ 1.09 శాతం లాభంతో రూ.2587.75 వద్ద ముగిసింది.

## 5 రోజుల వరుస లాభాలకు బ్రేక్.. సెన్సెక్స్ 931 పాయింట్లు డౌన్




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఐదు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లు పైకి కనిపించినా.. నివురుగప్పిన నిప్పులా ఎప్పుడు రాజుకుంటాయోనన్న భయాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ దాడులకు ప్రతిగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో మళ్లీ అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం స్టాక్ మార్కెట్‌లపై ప్రతికూల ప్రభావం పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, ఎఫ్ఐఐల విక్రయాలూ తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,319.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,562.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కనిపించింది. ఇంట్రాడేలో 76,347.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 931.25 పాయింట్ల నష్టంతో 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్అండ్‌టీ, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో మళ్లీ ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ప్రకటనతో 95 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర.. మళ్లీ 98.42 డాలర్లకు చేరింది. బంగారం ఔన్స్ 4728 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## స్మార్ట్‌టీవీల్లో ఇకపై 90 సెకన్ల యూట్యూబ్ యాడ్స్




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్‌టీవీ (శీబ్‌బఎవ ంజం)ల్లో సుదీర్ఘ అన్‌స్కిప్పబుల్ యాడ్స్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా 90 సెకన్ల వరకు స్కిప్ చేయలేని యాడ్స్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు తెలిసింది. ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఈతరహా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, దీనిపై యూట్యూబ్ నుంచి అధికార ప్రకటన రావాల్సిఉంది. ఇప్పటివరకు స్మార్ట్‌టీవీల్లో 30 సెకన్ల అన్‌స్కిప్పబుల్ యాడ్స్ మాత్రమే వస్తున్నాయి. దాని స్థానంలో 90 సెకన్ల పాటు ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 20 నిమిషాల నుంచి 40 నిమిషాల నిడివి కలిగిన వీడియోలకు ఈ తరహా యాడ్స్‌ను పుష్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు యూజర్లకు 90 సెకన్ల యాడ్స్ కనిపిస్తున్నాయి. సంబంధిత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు సంప్రదాయ ప్రకటనదారులను ఆకర్షించడం.. మరోవైపు యాడ్స్ వద్దనుకునే యూజర్లను ప్రీమియం వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ మార్పు చేస్తున్నట్లు టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీన్ని కేవలం స్మార్ట్‌టీవీలకే పరిమితం చేస్తారా? లేదంటే మొబైల్‌కూ వర్తింపజేస్తారా? చూడాలి మరి.

## పీపీఎఫ్ ఖాతా ఎన్నిసార్లు పొడిగించుకోవచ్చు? వడ్డీ ఎంతొస్తుంది?



దీర్ఘకాలంలో మంచి నిధిని నిర్మించడానికి ఉన్న మార్గాల్లో పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ ఒకటి (ప్రాఫీ). ఇది కేంద్ర ప్రభుత్వ మద్దతు, హామీ ఉన్న పథకం కావడంతో మీ సొమ్ముకు భరోసా ఉంటుంది. పైగా ఈ పథకంలో రాబడులపై పూర్తిగా ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలూ (పాత పన్ను విధానంలో) పొందొచ్చు. సాధారణంగా ఈ పథకం కాలవ్యవధి 15 ఏళ్లు. దీన్ని మరికొంత కాలం పొడిగించుకోవచ్చు. ఇలా ఎంతకాలం పొడిగించుకోవచ్చు? తద్వారా ఎంత మొత్తం సమకూరుతుంది?

ఎక్కడ తెరవొచ్చు?

పీపీఎఫ్ ఖాతాను పోస్టాఫీసులో గానీ, ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో గానీ తెరవొచ్చు. పూర్తి కాలవ్యవధి 15 సంవత్సరాలు. ఏడాదికి కనీస డిపాజిట్ కింద రూ.500, గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు డిపాజిట్ చేయొచ్చు. వడ్డీ ఏడాదికి ప్రస్తుతం 7.10% (3 నెలలకు ఒకసారి ప్రభుత్వం వడ్డీ నిర్ణయిస్తుంది.) లభిస్తోంది. ఈ డిపాజిట్‌కు, వడ్డీకి ప్రభుత్వం హామీ ఉంటుంది కాబట్టి 100% రిస్క్ లేదు. ఆర్థిక సంవత్సరం (మార్చి 31వ తేదీ) పూర్తికాగానే వడ్డీ జమ అవుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో పీపీఎఫ్ ఖాతాలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఖాతాను ఎన్నేళ్లు పొడిగించుకోవచ్చు?

పీపీఎఫ్ ఖాతా 15 ఏళ్లకు మెచ్యూర్ అవుతుంది. గడువు తర్వాత మూసేయొచ్చు. కావాలంటే పొడిగించుకోవచ్చు. ఐదేళ్ల బ్లాక్ చొప్పున ఎన్నిసార్లయినా పొడిగించుకునే వీలుంది. ఖాతాను పొడిగించాలంటే మెచ్యూరిటీకి ఏడాదిలోపు పొడిగింపు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. పొడిగించే కాలానికి డిపాజిట్ చేయొచ్చు. చేయకుండా కూడా కొనసాగించొచ్చు. మధ్యలో ఏదైనా అవసరం ఏర్పడితే అవసరాల నిమిత్తం ఒక బ్లాక్‌లో గరిష్ఠంగా 60% బ్యాలెన్స్‌ని విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఎంత వడ్డీ వస్తుంది? ప్రస్తుతం పీపీఎఫ్ ఖాతాలో జమయ్యే మొత్తంపై 7.1 శాతం వడ్డీ లభిస్తోంది. 15 ఏళ్ల పాటు ఈ ఖాతాలో గరిష్ఠ డిపాజిట్ మొత్తం అయిన రూ.1.50 లక్షలు చొప్పున జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత రూ.40.68 లక్షలు వస్తుంది. ఇందులో మీ అసలు 22.50 లక్షలు కాగా.. వడ్డీ రూ.18.18 లక్షలు లభిస్తుంది.

ఆప్షన్-1: ఒకవేళ మీరు మీ పీపీఎఫ్ ఖాతాను 5 సంవత్సరాలు పొడిగించి సంవత్సరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడిని కొనసాగిస్తే 20 ఏళ్ల తర్వాత సుమారు రూ.67 లక్షలు వరకు పొందొచ్చు. మరో 5 ఏళ్లు అంటే, 25 ఏళ్ల వరకు ఇదే పెట్టుబడితో కొనసాగిస్తే మెచ్యూరిటీ సుమారు రూ.1.03 కోట్లు వస్తుంది.

ఆప్షన్-2: ఒకవేళ మీరు మెచ్యూరిటీ తర్వాత ఎలాంటి పెట్టుబడులూ పెట్టకుండా మరో 5 ఏళ్ల పాటు పీపీఎఫ్ ఖాతాను కొనసాగిస్తే.. అసలూ వడ్డీ కలిపి 20 ఏళ్లకు రూ.57.32 లక్షలు వస్తుంది. పొడిగించిన ఐదేళ్ల కాలానికి దాదాపు రూ.16 లక్షలు వడ్డీ లభిస్తుంది. మరో ఐదేళ్లు అంటే 25 ఏళ్లకు రూ.80 లక్షలు వరకు సమకూరుతుంది.

చివరిగా: మీకు ఎలాంటి ఆర్థిక అవసరాలు లేకుండా ఉంటే పీపీఎఫ్ ఖాతాలో మెచ్యూరిటీ తర్వాత కూడా పొడిగించడమే మంచిది. అప్పుడే చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందొచ్చు. తక్కువ వయసులోనే ఖాతాను తెరవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

# అప్పటివరకు ఇరాన్ చుట్టూనే మా బలగాలు

## ట్రంప్ కీలక పోస్ట్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించడం కోసం కాల్పుల విరమణ ఒప్పందం జరిగినా.. పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక పోస్ట్ చేశారు. యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు.. తమ దేశానికి చెందిన యుద్ధనౌకలు, బలగాలు ఇరాన్ చుట్టూనే ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు."యుద్ధం ముగించే విషయంలో ఇరాన్ తో పూర్తిస్థాయి ఒప్పందం కుదిరి అది అమల్లోకి వచ్చేంత వరకు మా యుద్ధ నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది, ఆయుధాల వంటివన్నీ ఇరాన్, దాని పరిసర ప్రాంతాల్లోనే మోహరించి ఉంటాయి. ఏదైనా కారణంతో ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే గనుక.. మును పెన్నడూ చూడనంత స్థాయిలో మేం విరుచుకు పడతాం. ఈలోగా.. అమెరికా సైన్యం విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఇక, ఇరాన్ వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు ఉండ కూడదు. హర్మూజ్ జల సంధిని తెరిచి, దాన్ని సురక్షితంగా ఉంచాల్సిందే" అని ట్రంప్ తన ట్రూత్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

కాల్పుల విర మణ ఒప్పందం నుంచి వైదొలగుతామనీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ దీనిపై స్పందిస్తూ టెహ్రాన్‌కు మళ్లీ హెచ్చరికలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని పేర్కొంటూ ఇజ్రాయెల్ ఆ దేశంపై భీకర దాడులు చేసింది. ఇందులో వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది.

# పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

## 'శబరిమల' అంశంపై కేంద్రం

కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10-50 ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు. "మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. కాబట్టి ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ



వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

# ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో

## శాంతి చర్చలు అసమంజసం : ఇరాన్ రాయబారి



టెహ్రాన్ : ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో శాంతి చర్చలు 'అసమంజసం' అని ఇరాన్ పేర్కొంది. లెబనాన్‌పై బుధవారం ఇజ్రాయిల్ అత్యంత తీవ్రంగా విరుచుకు పడిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 245 మంది మరణించారు. ఇరాన్ ప్రతీకార హెచ్చరిక జారీ చేస్తూ.. అమెరికాతో శాశ్వత శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా చర్చలను కొనసాగించడం అవివేకమవుతాయని ఇరాన్ ప్రధాన రాయబారి, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ ఖాలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న హిజ్బుల్లాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని తీవ్రతరం చేసి ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందంలోని పలు షరతులను ఉల్లంఘించిందని ఖాలిబాఫ్ పేర్కొన్నారు. ఇరాన్ అణు లక్ష్యాలను వదులు కోవాలని అమెరికా షరతులు విధించి ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో, ద్వైపాక్షిక కాల్పుల విరమణ లేదా చర్చలు అసమంజసం అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాల్పుల విరమణ ఒప్పందం లోని నిబంధనల ప్రకారం యురేనియం నిల్వలనుకొనసాగించడానికి తమకు అనుమతి ఉందని ఆయన పేర్కొన్నారు.

# పాక్‌పై మాకు నమ్మకం లేదు

## ఇజ్రాయెల్ రాయబారి



అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయెల్ సందేహం వ్యక్తంచేసింది. ఇస్లామాబాద్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ రాయబారి మాట్లాడుతూ.. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం దాని మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకొందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఖతార్, తుర్కియే వంటి సమస్యాత్మక దేశాల ద్వారా హమాస్‌తో అమెరికా కుదుర్చుకొన్న ఒప్పందం గురించి ఆయన ప్రస్తావించారు. ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు యూఎస్ సమన్వయంతో ముందుకు సాగడం తమకు చాలా ముఖ్యమన్నారు. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, లెబనాన్‌పై మాత్రం తమ సైనిక చర్యలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు.

ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్మూలిం చడమే తమ లక్ష్యమన్నారు. అది ఇజ్రాయెల్ బాధ్యతగా అభివర్ణించారు.

# గుజరాతీలపై చేసిన వ్యాఖ్యలపై ఖర్గే విచారం



న్యూఢిల్లీ : గుజరాత్ ప్రజల పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని, వారిని నిరక్షరాస్యులంటూ చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నానని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. గుజరాత్ అన్నా.. ఆ రాష్ట్ర ప్రజలన్నా తాను ఎప్పుడూ గౌరవిస్తానని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. "కేరళం ఎన్నికల ప్రచారంలో గుజరాతీల పట్ల నేను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారు. అయినప్పటికీ.. ఆ వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నా." అని తెలిపారు.

# హెజ్‌బొల్లా నేత హతం..

## ఇజ్రాయెల్ ప్రకటన



లెబనాన్‌లోని మిలిటెంట్ సంస్థ హెజ్‌బొల్లాకు చెందిన మరో కీలక నేతను మట్టుపెట్టినట్టు ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) గురువారం ఎక్స్ వేదికగా తెలిపింది. హెజ్‌బోల్లా చీఫ్ నజీమ్ ఖాసిమ్‌కు బంధువు, వ్యక్తిగత సలహాదారుడైన అలీ యూసుఫ్ హార్షీ తమ దాడుల్లో కన్నుమూసినట్టు తెలిపింది. బుధవారం బీరుట్ నగరంలో జరిపిన దాడుల్లో యూసుఫ్ అలీ మరణించినట్టు పేర్కొంది. ఆయుధాలు, దళాలను తరలించేందుకు హెజ్‌బొల్లా ఉపయోగించే రెండు మార్గాలపై దాడులు చేశామని ఐడీఎఫ్ తెలిపింది. వీటితో పాటు దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లాకు చెందిన 10 ఆయుధాల నిల్వ కేంద్రాలు, సంస్థ కార్యాలయాలపై దాడులు చేశామని వెల్లడించింది. హెజ్‌బొల్లా చీఫ్ వ్యవహారాల్లో యూసుఫ్ ఖార్షీ కీలకంగా వ్యవహరించేరని పేర్కొంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడులతో అమెరికా-ఇరాన్‌ల కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రతికూల ప్రభావం ఆందోళనలు పెరుగుతున్నాయి. బుధవారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 182 మంది మరణించగా 800 మందికి పైగా గాయపడ్డారు. బీరుట్‌లోని హెజ్‌బొల్లా నేతలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ కేవలం 10 నిమిషాల్లోనే 100 మిసైల్స్‌ను ప్రయోగించింది. బీరూట్‌తో పాటు దక్షిణ లెబనాన్, బేకా వ్యాలీలో ఒకేసారి ఈ దాడులు చేసింది. పౌర నివాసాలు, సామాన్యులను అడ్డుపెట్టుకుని హెజ్‌బొల్లా తమపై దాడులు చేస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

# ఉత్కంఠకు తెర.. బారామతిలో

## సునేత్రా పవార్‌కు మార్గం సుగమం



మహారాష్ట్రలో బారామతి అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికపై కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. పోటీ నుంచి వైదొలగనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో డిప్యూటీ సీఎం సునేత్రా పవార్ ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. అజిత్ పవార్‌పై ఉన్న గౌరవంతో తమ అభ్యర్థిని ఉపసంహరించు కుంటున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ వెల్లడించారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సహా ఇతర సీనియర్ నేతలు కాంగ్రెస్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరి 28న మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన బారామతి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏప్రిల్ 23న అక్కడ పోలింగ్ జరగాల్సిఉంది. చివరకు పోటీ నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలగనున్నట్లు ప్రకటించింది. దీంతో పవార్‌కు కంచుకోటగా ఉన్న బారామతి నుంచి సునేత్రా పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

# నేపాల్ మాజీ ప్రధాని బహదూర్ దేవుబాపై

## అరెస్ట్ వారెంట్



ఖాట్మాండు : అవినీతి ఆరోపణలపై నేపాల్ మాజీ ప్రధాని బహదూర్ దేవుబాపై అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. మనీలాండరింగ్ విభాగం అభ్యర్థన మేరకు, దేవుబా భార్య, మాజీ విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవుబాపై కూడా అధికారులు వారెంట్ జారీ చేశారని ఖాట్మండుకోర్టు అధికారులు మీడియాకు వెల్లడించారు. దేవుబా, ఆయన భార్య సింగపూర్‌లో ఉండటంతో పోలీసులు ఇంటర్‌పోల్ నోటీసులు జారీచేసేందుకు యత్నిస్తున్నారని తెలిపింది. తాను, తన భార్య ప్రస్తుతం దీర్ఘకాలిక వైద్య చికిత్స కోసం విదేశాల్లో ఉన్నామని దేవుబా పేర్కొన్నారు. ఇతర వివరాలు వెల్లడించేందుకు నిరాక రించారు. గత నెలలో, సెప్టెంబర్‌లో జరిగిన అవినీతి వ్యతిరేక నిరసనలపై జరిగిన హింసాత్మక అణచివేతకు పాల్పడ్డారంటూ మరో మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలిని, మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన బాలేంద్ర షా ఇటీవల ప్రధానిగా ఎన్నికయ్యారు.

# ఇజ్రాయిల్ బరితెగింపు

- 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడి
- 254 మంది మృతి
- హర్మూజ్‌ను మూసివేసిన ఇరాన్



బీరూట్-టెహ్రాన్ : అనుకున్నంతా జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి లెబనాన్ రాదని వాదిస్తూ వచ్చిన ఇజ్రాయిల్ బరితెగించింది. ఒప్పందం కుదరిన 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడికి దిగింది. బుధవారం రాత్రి పది నిమిషాల వ్యవధిలోనే లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై వందకు పైగా వైమానిక దాడులు చేసింది. . ఇజ్రాయిల్ చేసిన ఈ భయానక దాడిలో 254 మంది మృతి చెందినట్లు 'ఆల్ జజీర' తెలిపింది. లెబనాన్ అధికారవర్గాలను ఉటంకిస్తూ ప్రచురించిన కథనంలో ఈ దాడుల్లో 1,165 మందికి పైగా గాయపడ్డారని, వీరిలో పలువురి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని పేర్కొంది. దీంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మరోమారు మూసివేసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి భిన్నంగా ఇజ్రాయిల్ చేసిన దాడులకు నిరసనగా జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. నిజానికి అంతకు కొన్ని గంటల ముందే ఇరాన్ ఈ మేరకు ప్రకటించింది. బుధవారం ఉదయం నుండి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రస్తావిస్తూ వాటిని కొనసాగిస్తే హర్మూజ్‌ను మూసివేసి, ఒప్పందం నుండి బయటకు వచ్చేస్తామని హెచ్చరించింది. అయితే, ఈ హెచ్చరికను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ భీకర దాడులకు తెగబడింది. 1982 తరువాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని చెబుతున్నారు. దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాదిక్ ఆలీ నబుల్సీ మరణించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి.

# అనిల్ అంబానీ రూ.73,000 కోట్ల మోసం

## – సీబీఐ



న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) 73,000 కోట్ల రూపాయల మోసం ఆరోపణలలో చిక్కుకుందని, ఏడు కేసులలో దర్యాప్తు కొన సాగుతోందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. బ్యాంకు ఉన్నతాధికారుల పాత్ర కూడా దర్యాప్తు పరిధిలో ఉందని కోర్టుకు సమర్పించిన తన స్టేటస్ రిపోర్టులో పేర్కొంది. సీల్డ్ కవర్‌లో సమర్పించిన ఈ సమాచారాన్ని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మొన్న బహిరంగ కోర్టులో వెల్లడించారు. సుమారు 73,006 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయని ధర్మాసనం తెలిపింది. మనీలాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ కూడా ఒక స్టేటస్ రిపోర్టును సమర్పించింది. ఈ కేసును విచారిస్తున్నప్పుడు దర్యాప్తు చేయ డానికి విముఖత చూపినందుకు సుప్రీంకోర్టు గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరియు సీబీఐలను విమర్శించింది. బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ. 31,580 కోట్లు రుణం తీసుకున్న ఆర్‌కామ్, ఆ డబ్బును అక్రమంగా పొందిందని ఆరోపిస్తూ మాజీ కేంద్ర కార్యదర్శి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం నేపథ్యంలో ఈ విచారణకు ఆదేశించారు.

# చూస్తూ ఊరుకోబోం.. ప్రాణత్యాగానికైనా సిద్ధం: స్టాలిన్

చెన్నై : నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రజల హక్కులకు తీవ్ర హాని కలుగుతుందని తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు మరింత మేలు(బలం) చేకూర్చేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీన్ని తమ పార్టీ చూస్తూ ఊరుకోబోదని, డీలిమిటేషన్‌ను వ్యతిరేకించే చర్యల్లో భాగంగా ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అంత అత్యవసరంగా పార్లమెంట్‌ను సమావేశపరచడం ఎందుకు? ఈ నెల 29వ తేదీ తర్వాత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలన్న విపక్ష నేతల న్యాయమైన సూచనను విస్మరించడం వెనుక ఆంతర్యం ఏమిటి' అని నిలదీశారు.



# ఏబీఎన్ రాధాకృష్ణ క్షమాపణలు చెప్పాలి

- మహిళలపై నీచమైన భాషలో వికృత ప్రచారాలు
- సభ్య సమాజం తలదించుకునేలా అసత్య ప్రేలాపణలు
- ప్రజలను డైవర్షన్ చేసేలా ప్రసారాలు
- రాధాకృష్ణకు సీఎం, డిప్యూటీ సీఎంల మద్దతుపై ఆగ్రహం
- టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :**మహిళలను కించపరిచేలా, సభ్య సమాజం తలించుకునేలా ఏబీయన్ రాధాకృష్ణ ప్రసారం చేసిన వార్తలతో ఆ ఛానెల్ ఆంధ్రా బ్రోతల్ నెట్ వర్క్ లా తయారైందని, ఇలాంటి వారు మీడియాలో ఉండి సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలని అనుకుం టున్నారో చెప్పాలని వైఎస్సార్సీపీ దక్షిణ నియోజక వర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, పార్టీని, మఖ్యంగా పార్టీ నాయకుల భార్యలైన నీఛ నికృష్ణమైన బాషతో దూషించిన వైనాన్ని నిరసిస్తూ, ఏబియన్ రాధాకృష్ణపైన, ప్రచారం చేసిన వ్యక్తులందరిపైన చర్యలు తీసుకోవాలని స్థానిక వన్ టౌన్, టూ టౌన్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.ఽఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కోసం మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చారని,మా నాయకుడు అడుగుజాడల్లో నడుస్తూ మేమంతా మావిగన్ కు సపోర్ట్ చేస్తే వైఎస్సార్సీపీ నాయకులను కించపరుస్తూ ఏబీయన్ రాధాకృష్ణ కొత్తపలుకు కార్యక్రమంలో సంస్కారహీనంగా మాట్లాడారని, అలాంటి వ్యాఖ్య లను ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నామన్నారు. ఏబీయన్ రాధాకృష్ణపై మేము మాట్లాడుతుంటే అదేదో తప్పన్నట్లుగా సీయం, డిప్యూటి సీయంలు ట్విట్టర్ ద్వారా స్పందనలు తెలియచేస్తున్నారని, అయితే తమ పార్టీ నాయకుల రాసలీలలు ప్రతి 15 రోజుల కొకసారి బయటకు వస్తున్నాయని,వాటిపై కూడా స్పందించా లన్నారు. అలా కాకుండా పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ వారికి డప్పు కొట్టే ఏబీయన్ కు సంపూర్ణ మద్దతును తెలుపుతూ ఇలా చేయడం సరికాదన్నారు.అమరాతి నిర్మాణం చేసేందుకు సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని చెబుతున్న నాయకులు అంత నగదు ఎక్కడి నుంచి తీసుకొస్తారో చెప్పాలని, ఇది ప్రజలపై భారం కాదా అని, మా నాయకుడు సూచించినట్లుగా అభివృద్ధిలో ఉన్న ప్రాంతాన్ని రాజధానిని చేస్తే 10 శాతం ఖర్చుతో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచిం చారని, దానిని ఏదో తప్పు చేసినట్లుగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేసి మరీ ఇలా వికృత కార్యక్రమాలతో ప్రజలను డైవర్షన్ చేసేలా చూస్తున్నారని, ఇది సమర్ధించదగ్గ విషయం కాదన్నారు. మహిళలను కించపరిచిన రాధాకృష్ణ క్షమాపణ చెప్పాలని, మహిళాభివృద్ధికి పెట్టపీట వేస్తున్నామని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వం రాధాకృష్ణ వ్యాఖ్యలపై ఏమి సమాధానం చెబుతారని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాధాకృష్ణకు మద్దతు తెలపడం దారుణమని, ఇదే పంథాలో కొనసాగితే ఆంధ్ర రాష్ట్రంలో మహిళా లోకమంతా ఏబీయన్ ఛానెల్ ను బ్యాన్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్స్,వార్డ్ ప్రెసిడెంట్స్, జిల్లా నాయకులు, స్టేట్ నాయకులు, వార్డ్ నాయకులు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు మరియు హ్యాచరీ నిర్వాహకులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన



**భీమునిపట్నం ఏప్రిల్ 09 నేటి మనదేశమ్ :** భీమిలి మండలం, తిమ్మాపురం గ్రామంలో ఎన్ ఎస్‌పిఎ ఎ డి బృందం ఫీల్డ్ విజిట్ మత్స్యశాఖ ప్రిన్సిపల్ అదనపు డైరెక్టర్ డా. ఎస్. అంజలి ఆదేశాల మేరకు, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ కె. శ్రావణి కుమారి పర్యవేక్షణలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ పి. లక్ష్మణరావు ఆధ్వర్యంలో, నేషనల్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ఫర్ అక్వాటిక్ యానిమల్ డిసీజెస్ బృందం భీమిలి మండలం, తిమ్మాపురం గ్రామంలో చేపల మరియు రొయ్యల సాగులో వ్యాధుల పర్యవేక్షణ మరియు నివారణపై ఫీల్డ్ విజిట్ నిర్వహించారు.ఈ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సీడ్ ప్రొడక్షన్‌లో కీలకమైన హ్యాచరీలను సందర్శించి, నమూనాలను సేకరించారు.

ఈ సందర్భంగా రైతులకు రొయ్యల సాగులో స్క్రీనింగ్ యొక్క ప్రాముఖ్యత, ముఖ్యంగా ఓ ఐ ఈ జాబితాలో ఉన్న వ్యాధులను ముందస్తుగా గుర్తించడం ఎంత ముఖ్యమో వివరించారు. వ్యాధుల నియంత్రణలో స్క్రీనింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, ఆరోగ్యకరమైన సీడ్ వినియోగం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చని అవగాహన కల్పించారు. అదనంగా, హ్యాచరీల నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ మరియు పర్యావరణ సమ తుల్యతను కాపాడే విధానాలపై హ్యాచరీ యజమానులతో చర్చించారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ డి ఓ : ఆర్. ఈశ్వర్ రాజు అధికారులు ఎన్. ఎన్. చైతన్య పి. శ్రీనివాసు లుఈ కార్యక్రమం ద్వారా రైతులు మరియు హ్యాచరీ నిర్వాహకులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన పెంపొందించడంతో పాటు, ఆరోగ్యకరమైన మరియు సుస్థిర సాగును ప్రోత్సహించారు.

## భారతీయుల్లో పెరుగుతున్న నిద్రలేమి - ఒక నిశ్శబ్ద మహమ్మారి

**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ప్రస్తుత ఆధునిక కాలంలో భారతీయులను పట్టిపీడిస్తున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో 'నిద్రలేమి' అగ్ర స్థానంలో ఉంది. తాజా అధ్యయనాల ప్రకారం, ప్రతి పదిమంది భారతీయులలో కనీసం నలుగురు సరైన నిద్ర లేక ఇబ్బంది పడుతున్నారు. యువతలో మరియు మహిళల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

నిద్రలేమికి ప్రధాన కారణాలు

జీవనశైలి: బిజీ షెడ్యూల్స్, కఠినమైన డెడ్లైన్లు మరియు సామాజిక ఒత్తిళ్లు.

టెక్నాలజీ: పడుకునే ముందు మొబైల్ ఫోన్లు, టీవీల అతి వినియోగం లింగ భేదం: పురుషుల (29%) కంటే మహిళల్లో (38%) ఈ సమస్య ఎక్కువగా ఉండటం గమనార్హం.

మన జీవనశైలిలో వచ్చిన మార్పులే నిద్ర నాణ్యతను దెబ్బతీస్తున్నాయి:

డిజిటల్ వ్యసనం: పడుకునే ముందు గంటల తరబడి మొబైల్ ఫోన్లు, టీవీలు చూడటం వల్ల మెదడు చురుగ్గా మారి నిద్ర పట్టనివ్వదు. పని ఒత్తిడి: కఠినమైన డెడ్లైన్లు, రాత్రి షిఫ్టులు మరియు కెరీర్ పట్ల ఆందోళనలు. లింగ వివక్ష: నిద్రలేమి సమస్య పురుషులలో 29% ఉండగా, మహిళల్లో ఇది 38% వరకు ఉంటోందని నివేదికలు చెబుతున్నాయి.

తక్షణ మరియు దీర్ఘకాలిక ప్రభావాలు : ఒక్క రోజు నిద్ర సరిగ్గా లేకపోయినా దాని ప్రభావం మన శరీరంపై వెంటనే కనిపిస్తుంది. దృష్టి లోపం, ఏకాగ్రత తగ్గడం, చిరాకు మరియు తలనొప్పి వంటివి ప్రాథమిక లక్షణాలు. అయితే, దీర్ఘకాలికంగా రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి:

1. గుండె ఆరోగ్యం: రక్తపోటు పెరగడం, కొలెస్ట్రాల్ మరియు హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.
2. మెటబాలిక్ సమస్యలు: ఆకలిని నియంత్రించే 'గ్రెలిన్', 'లెప్టిన్' హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని.. ఊబకాయం మరియు టైప్-2 మధుమేహానికి దారితీస్తుంది.
3. రోగనిరోధక శక్తి: నిద్రలో శరీరం ఉత్పత్తి చేసే 'సైటోకైన్స్' తగ్గడం వల్ల ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తి క్షీణిస్తుంది.
4. మెదడు ఆరోగ్యం: నిద్ర సమయంలో మెదడులోని టాక్సిన్లు (బీటా-అమైలాయిడ్) తొలగించబడతాయి. నిద్ర లేకపోతే అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతుంది.

మెరుగైన నిద్ర కోసం కొన్ని సూచనలు:

వైద్య నిపుణుల ప్రకారం, కొన్ని నియమాలు పాటిస్తే నిద్ర నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు: క్రమబద్ధమైన సమయం: ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవడం అలవాటు చేసుకోవాలి. బెడ్ రూమ్ వాతావరణం: పడుకునే గది చల్లగా, నిశ్శబ్దంగా మరియు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. గ్యాడ్జెట్లకు దూరం: నిద్రకు గంట ముందు ఫోన్లు, టీవీలను పక్కన పెట్టాలి. ఆహార నియమాలు: రాత్రిపూట కెఫీన్ (కాఫీ, టీ), మద్యం మరియు అతిగా తినడం మానుకోవాలి. శారీరక శ్రమ: క్రమ తప్పకుండా వ్యాయామం, యోగా లేదా ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది.

అయినప్పటికీ నిద్రలేమి, నిద్రపట్టకపోవడం, లేదా జీవిత భాగస్వామికి ఇబ్బంది కలిగించేంత బిగ్గరగా గురక పెట్టే సమస్య ఉన్నప్పుడు స్లీప్ స్టడీ (నిద్ర అధ్యయనం) బాగా ఉప యోగపడుతుంది. నిద్రలేమి ఒకోసారి శ్వాసను బిగపట్టే స్థితికి దారితీయవచ్చు, ఆ సమయంలో వ్యక్తి అసలు శ్వాస తీసుకో లేనట్లు కనిపిస్తాడు. దీనివల్ల రక్తపోటు పెరిగి, పక్షవాతం వచ్చే అవకాశాలు కూడా పెరుగుతాయి. ఈ రోజుల్లో అధిక రక్తపోటుకు ప్రధాన కారణం, అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ూూూ) అనే సమస్య వల్ల నిద్రకు సంబంధించిన ఇబ్బందులను సరిగ్గా గుర్తించకపోవడమే. అందువల్ల, ఈ లక్షణాలతో బాధపడుతున్న వ్యక్తులు నిద్ర నిపుణుడిని సంప్రదించి, విశాఖపట్నం సీతమ్మ ధారలోని మా లయన్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో అందు బాటులో ఉన్న స్లీప్ టెస్ట్ చేయించుకోవడం మంచిది.నిద్రలేమి సమస్య ఉన్నవారు తమ నిద్రను మెరుగుపరచుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే లినిద్ర జీవితంలో ఒత్తిడిని తగ్గించే అతిపెద్ద సాధనం, కానీ నిద్రపోవడమే మీకు ఒత్తిడిని కలిగిస్తుంటే, "లయన్స్ స్లీప్ సెంటర్"కు రావాల్సిన సమయం ఆసన్నమైంది అని భావించాలి. అవసరాన్ని బట్టి మేము ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ మరియు స్లీప్ మెడిసిన్ నిపుణులు డా. ఎస్. ఎం. అహ్మద్, వీణ, ఐచీదీ; హెడ్ అండ్ నెక్ ENT సర్జన్

డా.ఎస్. సుశ్రుత, మీా-జుచీ మరియు అవసరమైతే మానసిక నిపుణుల పర్యవేక్షణలో మీకు సూచనలు మరియు చికిత్సలు అందించడం జరుగుతుంది. డాక్టర్ వెలగపూడి ఉమా మహేశ్వరరావు, మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,

**లయన్స్ జిల్లా గవర్నర్ (2000-2001), మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం. 9849162699.**

# 'సిటీ ఆఫ్ డెస్టినీ' నుంచి గ్లోబల్ ఎఐ సిటీగా విశాఖ...

## గూగుల్ మెగా ప్రాజెక్టుతో చారిత్రాత్మక మైలురాయి

- చంద్రబాబు విజన్-లోకేష్ కృషి ఫలితం... - ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి నూతన యుగానికి నాంది

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐటీ రంగంలో చారిత్రాత్మక ముందడుగు వేయ బోతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు తెలిపారు. ఈ నెల 28న విశాఖపట్నంలో ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ డేటా సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. సుమారు 15 బిలియన్ డాలర్లు (రూ.1.35 లక్షల కోట్లు) భారీ పెట్టుబడితో 601 ఎకరాల విస్తీర్ణంలో ఈ మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని, 2028 జూలై నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అపూర్వమైన పెట్టు బడులు రావడంతో పాటు లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఇప్పటివరకు 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా పేరుగాంచిన విశాఖపట్నం ఇకపై గ్లోబల్ స్థాయిలో ఎఐ సిటీగా అవతరించబోతోందని తెలిపారు. దేశంలోనే తొలి 1 గిగావాట్ ఎఐ హబ్‌గా విశాఖ రూపుదిద్దుకోవడం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి నూతన దిశను నిర్దేశిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సాంకేతిక అభివృద్ధిపై ఉన్న స్పష్టమైన విజన్ వల్లే గూగుల్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి ఆకర్షితమవుతున్నాయని పల్లా గారు కొనియాడారు. అలాగే మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి, పట్టుదల, వేగ వంతమైన కార్యాచరణ వల్లే ఈ భారీ పెట్టుబడి ఆంధ్రప్రదేశ్‌కు సాధ్యమైందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతం మొత్తం టెక్నాలజీ హబ్‌గా మారి, మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అనుభవం లభించి, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణంతో గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నదని పల్లా గారు తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ఉత్తరాంధ్ర మొత్తం అభివృద్ధి దిశగా పయనిస్తూ, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తాయని అన్నారు. ఇది కేవలం ఒక డేటా సెంటర్ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తుకు, రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకమైన మహత్తర అవకాశం అని పల్లా గారు పేర్కొన్నారు. ఈ పెట్టుబడులను అడ్డుకునేందుకు ఎన్నో ప్రతికూల శక్తులు ప్రయత్నించినప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో వాటన్నింటినీ అధిగమించి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. గూగుల్ పెట్టుబడులు రాష్ట్ర అభివృద్ధి పథంలో ఒక కీలక మైలురాయిగా నిలిచి, "విజన్ ఆంధ్ర ప్రదేశ్"కు మరింత బలం చేకూర్చే చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తాయని పల్లా శ్రీనివాసరావు గారు పేర్కొన్నారు.

## కొంతమంది పిల్లలకు గణితం ఎందుకు కష్టంగా ఉంటుంది?

**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :**కొంతమంది పిల్లలు గణితంతో ఇబ్బంది పడతారు. ఇప్పుడు, శాస్త్రవేత్తలు దీనికి కారణాన్ని వివరించగల కొన్ని నిర్దిష్ట ఆలోచనా ప్రక్రియలను మరియు మెదడు ప్రాంతాలను గుర్తించారు. గణితం నేర్చుకోవడంలో పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందుల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను అందరూ తెలుసుకోవాలి. ముఖ్యంగా గణితం అంటే కేవలం లెక్కలు చేయడం మాత్రమే కాదు, అది మెదడులోని వివిధ ప్రాంతాల మధ్య జరిగే ఒక సంక్లిష్టమైన సమన్వయం అని ఒక అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఈ అధ్యయనంలోని ముఖ్యాంశాలను మరియు మెదడు పనితీరును సులభంగా అర్థం చేసుకోవడానికి ఒక విశ్లేషణ:

1. మెదడులోని కీలక ప్రాంతాలు - వాటి పాత్ర

సాధారణ గణిత నైపుణ్యాలు ఉన్న పిల్లలతో పోలిస్తే, గణితం నేర్చుకోవడంలో ఇబ్బందులు ఉన్న పిల్లలకు సులభమైన గణిత సమస్యలు ఇచ్చినప్పుడు, వారు తమ సమాధానాలు చెప్పడంలో తక్కువ జాగ్రత్త వహించారని మరియు తప్పులు చేసిన తర్వాత నెమ్మదించలేదని ఒక కొత్త అధ్యయనం చూపిస్తోంది. గణిత అభ్యసన వైకల్యాలు (ఐఎంఖ్రీఎబశ్రీఖు వంటివి) ఉన్న పిల్లల్లో ప్రధానంగా రెండు మెదడు ప్రాంతాల పనితీరులో మార్పులను శాస్త్రవేత్తలు గుర్తించారు:

మిడిల్ ఫ్రంటల్ గైరస్ : ఇది సంఖ్యలను ప్రాసెస్ చేయడం మరియు వర్కింగ్ మెమరీ కి సంబంధించింది. గణితంలో ఇబ్బందులు ఉన్న పిల్లల్లో ఈ ప్రాంతం తక్కువ యాక్టివ్‌గా ఉండటం వల్ల వారు సమాధానాలు ఇచ్చేటప్పుడు అజాగ్రత్తగా ఉండే అవకాశం ఉంది.

యాంటీరియర్ సింగులేట్ కార్టెక్స్ : ఇది తప్పులను గుర్తించడం మరియు మన పనితీరును మనమే పర్యవేక్షించు కోవడంలో సహాయపడుతుంది. సాధారణంగా ఎవరైనా తప్పు చేసినప్పుడు, మెదడు హెచ్చరించి తదుపరి ప్రయత్నంలో వేగాన్ని తగ్గిస్తుంది కానీ ఇబ్బందులు ఉన్న పిల్లల్లో ఈ ప్రాంతం తక్కువగా స్పందించడం వల్ల వారు తప్పు చేసినా వేగం తగ్గించకుండా ముందుకు వెళ్తుంటారు.

2. సంఖ్యా చిహ్నాల సవాలు

సంఖ్యా చిహ్నాలు ఒక సవాలుగా ఉంటాయనే ఆలోచన కొత్తది కాదు. కానీ గణితం నేర్చుకోవడంలో ఇబ్బందులు ఉన్న పిల్లలు సమస్యలను పరిష్కరించే విధానంలోని సూక్ష్మమైన తేడాలు, సంఖ్యా చిహ్నాలతో వారి ఇబ్బందులకు మూలకారణం ఏమిటో అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి.

ఈ అధ్యయనంలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, పిల్లలకు 'అరబిక్ సంఖ్యలు' (1, 2, 3...) ఇచ్చినప్పుడు మాత్రమే సమస్య ఎదురైంది. అదే సంఖ్యలను 'చుక్కల' రూపంలో చూపించినప్పుడు వారి మెదడు పనితీరు సాధారణ పిల్లలతో సమానంగా ఉంది.

దీనిని బట్టి, ఆ పిల్లలకు 'పరిమాణం' పట్ల అవగాహన ఉంది, కానీ ఆ పరిమాణాన్ని ఒక 'చిహ్నం'తో అనుసంధానించడంలోనే సమస్య ఉందని అర్థమవుతోంది. 3. పరిష్కార మార్గాలు - విద్యా విధానంలో మార్పులు

ఈ పరిశోధన భవిష్యత్తులో బోధనా పద్ధతులను మార్చడానికి ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం:

ప్రస్తుత సమస్య: తప్పులను గుర్తించకపోవడం

పరిష్కారం: పిల్లలు తాము సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారో వారికే వివరించేలా చేయడం

ప్రస్తుత సమస్య: చిహ్నాలతో ఇబ్బంది

పరిష్కారం: నేరుగా సంఖ్యలతో కాకుండా, దృశ్యరూపకమైన వస్తువులు లేదా చుక్కలతో గణితాన్ని నేర్పించడం.

ప్రస్తుత సమస్య: అజాగ్రత్త

పరిష్కారం: సమస్యను పరిష్కరించేటప్పుడు

వేగం కంటే కచ్చితత్వంపై దృష్టి పెట్టేలా మెంటరింగ్ చేయడం.

గణితం కష్టంగా అనిపించే పిల్లలు "తెలివి తక్కువ వారు" అని ముద్ర వేయడం కంటే, వారి మెదడు సమాచారాన్ని విశ్లేషించే తీరు భిన్నంగా ఉంటుందని గుర్తించడం ముఖ్యం. సంఖ్యల చిహ్నాలను అర్థం చేసుకోవడంలో వారికి అదనపు సహకారం మరియు విభిన్న వ్యూహాలను నేర్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చు.

డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,
విశ్రాంత ఆచార్యులు,
అనువర్తిత గణితశాస్త్ర విభాగం మరియు
మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం.

# దివిస్ లో రక్తదాన శిబిరం




**భీమునిపట్నం ఏప్రిల్ 09 నేటి మనదేశమ్ :** మనం చేసేది చిన్న సాయమైనా ఎంతోమంది ప్రాణాలను కాపాడు తుందంటే అతిశయోక్తి లేదు అదే రక్తదానం.అటువంటి రక్తదానం రక్త నిధి కేంద్రాల పర్యవేక్షణలో ఏళ్ల తరబడి సామాజిక బాధ్యతలో భాగంగా విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం చిప్పాడ లో దివిస్ లేబొరేటరీస్ లో నిరంతరాయంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి సేవలందిస్తోంది. దివిస్ జనరల్ మేనేజర్ స్వర్గీయ చంద్ర దివి ఆశయాలకు అనుగుణంగా ఆయన జయంతిని పురస్కరించుకొని ఉత్తరాంధ్ర జిల్లాల రక్తనిధి కేంద్రాల పర్యవేక్షణలో సుమారు 1000 యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం దివిస్ లేబరేటరీస్ జిఎం స్వర్గీయ చంద్ర దివి 56వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని సంస్థ ఉపాధ్యక్షులు ఎల్వి రమణ ప్రారంభించారు. దివిస్ లేబరేటరీస్ జనరల్ మేనేజర్లు వైయస్ కోటేశ్వరరావు, ఈ రామకృష్ణ, పున్నారావు ,ప్రద్యుమ్న లతో కలిసి స్వర్గీయ చంద్ర దివి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఉద్యోగినులు కూడా మేము సైతం అంటూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి మరెంతో మందికి ఆదర్శంగా నిలిచారు. ఎన్టీఆర్, ఇండియన్ రెడ్ క్రాస్, ఎస్ రాజా, రోటరీ క్లబ్, లైఫ్ షేర్, విశాఖ ఎన్విఎన్, ఉత్తరాంధ్ర జిల్లాల రక్తనిధి కేంద్రాల పర్యవేక్షణలో దాతలు నుండి రక్తాన్ని సేకరించారు. సుమారు 1000 నుండి 1300 మంది ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎల్వి రమణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఏదో విధంగా సహాయ పడాలని చంద్ర దివి లక్ష్యసాధనకు నిరంతరాయంగా సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా కృషి చేస్తుందన్నారు. స్వర్గీయ చంద్ర దివి ప్రారంభించిన రక్తదాన శిబిరాన్ని గత 23ఏళ్లుగా కొనసాగిస్తున్నామన్నారు. స్వచ్ఛంద రక్తదానం మరి ఎంతో మంది ప్రాణాలకు భరోసాగా నిలుస్తోందన్నారు. ప్రధానంగా వేసవికాలంలో రక్త నిలువలు సాధారణంగా తగ్గుతాయి అన్నారు ఈ క్రమంలోనే ఏటా రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు సామాజిక బాధ్యతలో భాగంగా రక్త నిల్వలకంద్రాలకు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.జగదీష్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు గోపీనాథ్, చంద్రశేఖర్, శిబిరం ఆర్గనైజర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com